TITLE CODE: APTEL16281

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ

సంపుటి : 01 | సంచిక : 216 | ఎడిటర్ : ఎం. రమేష్ | ఆదివారం, జులై 07, 2024 | పేజీలు : 08 | వెల రూ. 5.00/-

# ముగిసిన సిఎంల స్థాయి భేటీ







**విభజన సమస్యలపై రెండు కమిటీల ఏర్పాటు**
**మంత్రులతో ఒకటి, అధికారులతో మరోటి ఏర్పాటు**
**అనేక అంశాలతో పాటు, ఐదుగ్రామాల విలీనంపై చర్చలు**
**విభజన అంశాలపై రోడ్ మ్యాప్ ఖరారు**
**మరోమారు భేటీకి ఇరు రాష్ట్రాల సిఎంల అంగీకారం**

**హైదరాబాద్,జూలై6(పీపుల్స్ మోటివేషన్):**

విభజన సమస్యల పరిష్కారమే అజెండాగా హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ముగిసింది. దాదాపు రెండు గంటలపాటు సాగిన భేటీలో పది కీలక అంశాలపై ముఖ్యమంత్రులు చర్చించారు. సమస్యల పరిష్కారానికి మంత్రులతో ఒక కమిటీ, అధికారులతో మరో కమిటీ వేయాలని నిర్ణయించినట్టు సమాచారం. ముఖ్యంగా ఇరు రాష్ట్రాల ప్రయోజనాలకు భంగం కలగకుండా పరిష్కారాలు ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. పెండింగ్ సమస్యల పరిష్కారంపై ఇద్దరు ముఖ్యమంత్రులు అధికారుల సూచనలు తీసుకున్నారు. న్యాయపరమైన చిక్కులపై కూడా చర్చించారు. షెడ్యూల్ 10లోని అంశాలపైనే ప్రధానంగా చర్చ జరిగింది. నిర్ణీత వ్యవధిలో సమస్యలు పరిష్కరించుకోవాలనే ఏకాభిప్రాయానికి ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వచ్చినట్టు తెలిసింది.తెలంగాణ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతి కుమారి పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రులు అనగాని సత్యప్రసాద్, బి.సి.జనార్దన్‌రెడ్డి, కందుల దుర్గేష్, సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, ఇతర అధికారులు హాజరయ్యారు.ప్రధానంగా చర్చించిన అంశాల్లో ఇవి ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం షెడ్యూలు 9, 10లో పేర్కొన్న సంస్థల ఆస్తుల పంపకాలు. విభజన చట్టంలో పేర్కొనని సంస్థల ఆస్తుల పంపకాలు. ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ అంశాలు. పెండింగ్ విద్యుత్తు బిల్లులు, విదేశీ రుణసాయంతో ఉమ్మడి రాష్ట్రంలో 15 ప్రాజెక్టులు నిర్మించారు. వాటి అప్పుల పంపకాలు. ఉమ్మడి సంస్థలకు చేసిన ఖర్చుకు చెల్లింపులు. హైదరాబాద్‌లో ఉన్న మూడు భవనాలు ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించే అంశం. లేబర్ సెస్ పంపకాలు. ఉద్యోగుల విభజన అంశాలు చర్చకు వచ్చాయి. మంత్రుల, అధికారుల కమిటీ వీటిపై చర్చించనుంది. హైదరాబాద్‌లోని ప్రజాభవన్ వేదికగా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ప్రారంభమైంది. రేవంత్ ఎలా ఉన్నావంటూ చంద్రబాబు ఆప్యాయంగా పలకరించారు. కొద్దిసేపు ఇద్దరు నేతలు మాట్లాడుకున్న తర్వాత సమావేశం ప్రారంభమైంది. ప్రస్తుతం అధికారుల సమక్షంలో విభజన చట్టంలో అంశాలు, ఆస్తుల పంపకంపై చర్చించారు. ఇద్దరు సీఎంల భేటీలో దీర్ఘకాలంగా పరిష్కారం కానీ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. ఏపీ కొన్ని డిమాండ్లను తెలంగాణ ప్రభుత్వం ముందు పెట్టగా.. తెలంగాణ కొన్ని డిమాండ్లను ఏపీ ప్రభుత్వం ముందు పెడుతోంది. కొన్ని అంశాల్లో మాత్రం ఏకాభిప్రాయం వచ్చే అవకాశం కనిపించడం లేదు. ముఖ్యంగా విలీన గ్రామాల విషయంలో చర్చించినట్లు తెలుస్తోది. 2014లో టీడీపీ ప్రభుత్వం ఏర్పడటానికి ముందు భవిష్యత్తులో పోలవరం ప్రాజెక్టుకు ఎటువంటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ఏడు మండలాలను ఏపీలో కలపాలని చంద్రబాబునాయుడు కోరగా.. కేందప్రభుత్వం సుముఖంగా స్పందించి.. ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసింది. ఆ నిర్ణయాన్ని అప్పటి తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకించింది. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం కూడా విలీన మండలాలను తెలంగాణలో కలపాలని కోరుతోంది. ఇది పక్కనపెడితే మిగిలిన అంశాల్లో ఎక్కువ అంశాలకు ఈ సమావేశంలో పరిష్కారం దొరికే అవకాశం ఉంది. ఈక్రమంలో ఆర్థికపరమైన అంశాలపై ఏవిధమైన చర్చ జరుగు తుందనేది ఆసక్తిగా మారింది.వీటితో పాలు ఏపీ, తెలంగాణ మధ్య వివాదం నెలకొన్న విద్యుత్ బకాయిల అంశంపై మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి చంద్రబాబు, రేవంత్ రెడ్డి చర్చించారు. పదేళ్లుగా పరిష్కారం కాని విభజన హామీలు, ఆస్తుల పంపకానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ప్రజా భవన్‌లో సమవేశమైన తెలుగు రాష్ట్రాల సీఎంలు రెండు గంటలపాటు చర్చలు జరిపారు. మరోసారి భేటీ కావాలని ఇద్దరు నేతలు నిర్ణయించారు. ప్రధానంగా భద్రాచలం నుండి ఏపీలో కలిపిన ఏడు మండలాల్లోని 5 గ్రామాలను తమకు తిరిగి ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈ విషయంలో చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. భద్రాచలం పట్టణానికి అనుకుని ఉన్న ఎటపాక, కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు, గుండాల, పురుషోత్తపట్నం పంచాయతీలను..తిరిగి తెలంగాణలో కలపాలన్న డిమాండ్ ఎప్పటి నుండో వినిపిస్తుంది. ఈ గ్రామాల విలీనంతో భద్రాచలం పట్టణ అభివృద్ధికి అవకాశం ఉంటుందని చెబుతోంది. అయితే ఓ రాష్ట్రంలోని గ్రామాలను వేరే రాష్ట్రంలో కలపాలంటే.. కేంద్ర అనుమతి తప్పనిసరి. కేంద్ర హోంశాఖకు లేఖ రాయాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రజాభవన్ భేటీలో విభజన సమస్యల పరిష్కారానికి రోడ్ మ్యాప్ ఖరారు చేశారు ఇరువురు ముఖ్యమంత్రులు. రాష్ట్ర ప్రయోజనాలపై రాజీపడకుండా ఉమ్మడి అజెండాపై కలిసిపని చేయాలని రెండు రాష్ట్రాలు మొదటి నుంచి భావిస్తున్నాయి. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, అభివృద్ధి ప్రాజెక్టుల కోసం ఉమ్మడిగా ప్రయత్నిం చాలని, ఎగువ రాష్ట్రాలతో నీటి వాటాలపై కలిసి పోరాడేలా ఉమ్మడి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని నిర్ణయించారు. ఉమ్మడి ఏపీ విభజన జరిగి పదేళ్లు పూర్తయినా కూడా.. అనేక కీలకాంశాలు ఇంకా పెండింగ్‌లో ఉండిపోయాయి. అధికారుల స్థాయిలో కొన్నిసార్లు చర్చలు జరిగినా చాలా విషయాలు ఇంకా కొలిక్కి రాలేదు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రుల భేటీ సందర్భంగా ఉమ్మడిగా తొమ్మిది ఎజెండా అంశాలను ఖరారు చేశారు. ఈ ఎజెండాలో రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం షెడ్యూలు 9, 10లో పేర్కొన్న సంస్థల ఆస్తుల పంపకాలు, విభజన చట్టంలో చేర్చని సంస్థల ఆస్తుల పంపకాలు, ఏపీ ÷నాన్షియల్ కార్పొరేషన్ అంశాలు, పెండింగ్ విద్యుత్తు బిల్లులు, విదేశీ రుణ సాయంతో నిర్మించిన ప్రాజెక్టుల ఆస్తులు–అప్పుల పంపకాలు, ఉమ్మడి సంస్థలకు చేసిన చెల్లింపులు, లేబర్ సెస్ పంపకాలు, ఉద్యోగుల విభజన అంశాలపై చర్చించారు.

## వ్యర్థాల పునర్వినియోగంపై వర్క్‌షాప్

**అధికారులకు డిప్యూటీ సిఎం పవన్ సూచనలు**



**విజయవాడ,జూలై6(పీపుల్స్ మోటివేషన్):**

వ్యర్థాలను వినియోగించే ప్రక్రియను శాస్త్రీయంగా నిర్వహించాలని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులకు సూచించారు. వీటిపై అవగాహన కోసం గ్రామాల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై వర్క్ షాప్ ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆయన పరిశీలించారు. వ్యర్థాల విషయంలో సృజనాత్మకంగా ఆలోచించి పునర్వినియోగిస్తే పారిశుద్ధ్య సమస్యను అధిగమించ వచ్చన్నారు.గ్రామాల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణకు అనుసరించాల్సిన విధానాలు, వాటి నుంచి ఎటువంటి ఉత్పత్తులు సాధించవచ్చన్న అంశాలపై సాలిడ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో గార్బేజ్ టు గోల్డ్ పేరుతో ఒక ప్రదర్శన నిర్వహించారు. చెట్ల నుంచి రాలే ఆకులను, కొమ్మలను, పొడి చెత్తను ఊడ్చిన తరవాత తగులపెట్టడం వల్ల వాతావరణ కాలుష్యం పెరుగుతోందన్నారు. వాటిని కంపోస్టుగా మారిస్తే ఎరువుగా ఉపయోగ పడుతుందని.. ఈ విషయంలో స్థానిక సంస్థలు తగు చర్యలు చేపట్టాలన్నారు. రీ సైకిల్ కాని వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించకుండా చూడాలని కోరారు. స్థానిక సంస్థలకు వ్యర్థాలు, పారిశుద్ధ్య నిర్వహణ ఒక సవాల్‌గా మారుతోందని.. శాస్త్రీయ దృక్పథంతో ఘన, ద్రవ వ్యర్థాలను నిర్వహించడంపై అధ్యయనాలు జరుగుతున్నాయన్నారు.

## దాడులతో హింసాకాండకు దిగడం దారుణం





**రేపు మీకు కూడా ఇదే గతి పడుతుంది జాగ్రత్త**
**కడప రిమ్స్‌లో వైసిపి కార్యకర్తకు జగన్ పరామర్శ**
**టిడిపి కక్షపూరిత దాడులకు పురిగొల్పుతోందని విమర్శలు**

**పులివెందుల,జూలై6(పీపుల్స్ మోటివేషన్):**

దాడుల సంప్రదాయాన్ని ఆపాలని, లేకపోతే రేపు మీకు ఇలాంటే గతి పడుతుందని వైఎస్సార్ సీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. వైఎస్ జగన్ శనివారం కడప జిల్లా పర్యటనకు వెళ్లారు. ఈ క్రమంలో కడప రిమ్స్‌కు వెళ్లి వెంపల్లిలో ప్రత్యర్థుల దాడిలో గాయపడిన వైసీపీ కార్యకర్త అజయ్‌కుమార్ రెడ్డిని వైఎస్ జగన్ పరామర్శించారు. బాధితుడికి తాము అండగా ఉంటామని, ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. బాధితుడి గాయాలు, మెడికల్ కండీషన్ పై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ.. '25 ఏళ్ల యువకుడు అజయ్ కుమార్ రెడ్డిని టీడీపీ శ్రేణులు దారుణంగా కొట్టాయి. ఎందుకంటే తను వైఎస్సార్ సీపీ పార్టీకి ఓటు వేశాడని, అదే పనిగా కావాలని వాహనాల్లో వెంప్లలెకు వచ్చి అతడి బైక్ అడ్డుకుని దాడికి పాల్పడ్డారని వైఎస్ జగన్ ఆరోపించారు. పాతికేళ్ల యువకుడిపై ఎందుకంత కోపం, వైసీపీకి సంబంధించిన వ్యక్తులు కనిపిస్తే ఇలాగే దాడులు చేస్తారా అని మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రశ్నించారు. ఇలా దాడులు చేసి అమాయకులపై నిర్దాక్షిణ్యంగా దాడులు చేసి ఆసుపత్రి పాలు చేస్తే మీకు కలిగే ప్రయోజనం ఏముంది, ఏం సాధిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఎన్నో ఎన్నికలు జరిగాయి, కానీ పులివెందులలో తొలిసారి తమకు ఓటు వేయని వారిపై ఇలాంటి దాడులు చేయడం కరెక్ట్ కాదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి భయాందోళన కలిగించే చర్యలకు దిగుతున్నారు. ఇప్పుడు మీరు వేస్తున్న బీజం, చేసే పనులు రేపు పొద్దున టీడీపీ కార్యకర్తలకు చుట్టుకుంటుంది. ఇలా భయందోళన కల్పిస్తే తనకు ప్రయోజనం ఉందని భావిస్తున్నారు. కానీ చంద్రబాబు దయచేసి ఈ చెడు సంప్రదాయాన్ని తప్పకుండా ఆపేయండి. ఎప్పటికీ మీరే అధికారంలో ఉండరు. శిశుపాలుడి పాపాల్లా పెరిగిపోతున్నాయి. వీటిని గమనిస్తున్న ప్రజలు, ఇప్పుడు దెబ్బతిన్న వారు రేపు అటువైపు ఇలాంటి దాడులు చేయడానికి చంద్రబాబు బీజం వేస్తున్నారు. నాయకులుగా మేం ఇలాంటి చర్యలకు దిగకూడదు. దయచేసి వీటిని ఇక్కడితో ఆపేయాలి. లేకపోతే భవిష్యత్తులో టీడీపీ శ్రేణులపై దాడులకు ఇవి ప్రేరేపిస్తున్నాయని' వైఎస్ జగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ధ్యాహ్న భోజన పథకం సరిగ్గా అమలు కావడం లేదని వైఎస్ జగన్ ఆరోపించారు. 90 మంది చిన్నారులు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. వారికి బ్యాగులు, కిట్లు సైతం సరిగ్గా పంపిణీ చేయడం లేదని విమర్శించారు. మాకు రావాల్సిన 10 శాతం ఓట్లు మీకు ఎందుకు పడ్డాయంటే, చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత హామీలే కారణం. స్కూళ్లు ప్రారంభమయ్యాయి. కానీ అమ్మ ఒడి డబ్బులు ఇంకా అకౌంట్లో వేయడం లేదన్నారు. ప్రతి ఇంటికి రూ.3 వేల నిరుద్యోగ భృతి కోసం జాబ్స్ లేని యువత ఆశగా ఎదురుచూస్తోంది. కావాలంటే ఇలాంటి హామీలు నెరవేర్చాలి కానీ తమకు ఓటు వేయలేదనన కక్షతో దాడులు చేయడం సరికాదని వైఎస్ జగన్ హితవు పలికారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

## సిఎంల భేటీ ప్రత్యక్షప్రసారం

**మాజీమంత్రి బొత్స డిమాండ్**

**ఘాటుగా కౌంటర్ ఇచ్చిన టిడిపి మంత్రులు**

**అమరావతి,జూలై6(పీపుల్స్ మోటివేషన్):**

తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు సమావేశానికి సంబంధించి వైసీపీ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన ట్వీట్‌పై టీడీపీ నేతలు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. పారదర్శకత కోసం, ప్రజలకు వాస్తవాలు తెలియడానికి ముఖ్యమంత్రులు సమావేశాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తే బాగుంటుందంటూ బొత్స ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌పై మంత్రి అచ్చెన్నాయుడు ట్విట్టర్(ఎక్స్) వేదికగా స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. భలే జోకులేస్తున్నారు బొత్స గారు..! పారదర్శకత గురించి మీరు.. జగన్ మాట్లాడితే నవ్వొస్తారు.. వద్దులెండీ..? పారదర్శకతకు పాతరేసిందే మీరు.. మీ పార్టీ. ప్రెస్ మీట్లు కూడా లైవ్ కాకుండా ఎడిట్ చేసి ఇవ్వాలని ఆదేశించే నాయకత్వంలో మీరు పని చేస్తున్నారు. దయచేసి పారదర్శకత.. వాస్తవాలు వంటి పెద్ద పెద్ద పదాలు మీరు వాడొద్దు.. ప్రజలకు అన్ని విషయాలు తెలుసు..సమావేశమయ్యాక.. అన్ని తెలుస్తాయి' అని అచ్చెన్నాయుడు తెలిపారు.

మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన ట్వీట్‌పై టీడీపీ ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి కూడా కౌంటర్ ఇచ్చారు. పారదర్శకత కోసం, ప్రజలకు వాస్తవాలు తెలియడానికి ముఖ్యమంత్రుల సమావేశాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తే బాగుంటుందంటూ బొత్స ట్వీట్ చేశారు. దీనిపై అమర్నాథ్ స్పందిస్తూ.. 'ఆవేశపడకు బొత్సా.. అక్కడ ఉంది జగన్ కాదు, చంద్రబాబు.. మీ జగన్ రాగానే, ఏ చర్చలు లేకుండా అప్పనంగా ఏపీ భవనాలు అప్పగించింది మర్చిపోలేదు.. ఢిల్లీలో ఏపీ భవన్ ఇచ్చేస్తాని చెప్పిన మాటలు మర్చిపోలేదు' అంటూ వ్యాఖ్యలు చేశారు. బందర్ పోర్టులో వాటా ఇస్తామని చెప్పిన విషయం మర్చిపోలేదన్నారు. తాళాలు పగలగొట్టి ఏపీ ఆయుష్ భవనాన్ని స్వాధీనం చేసుకుంటే నోరు మూసుకున్న విషయం మర్చి పోలేదన్నారు. పోలవరం నీళ్ళు కేసీఆర్ తీసుకుని వెళ్తామని చెప్పిన మాట మర్చిపోలేదని ఆయన అన్నారు. పోలవరం ఎత్తు తగ్గించమని జగన్‌కు చెప్పానని కేసీఆర్ చెప్పింది మర్చిపోలేదన్నారు. కేసీఆర్ కాళ్ళ మీద విజయసాయి రెడ్డి పడిన విషయం మర్చిపోలేదని విమర్శించారు. చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఏపీ ప్రయోజనాల కోసమే పని చేస్తారని స్పష్టం చేశారు. సీనియర్ నేతగా రెండు తెలుగు రాష్ట్రాల బాగు కోసమే పని చేస్తారన్నారు. 'మీ లాగా కేసులు కోసం, ఆస్తులు కాపాడుకోవలసిన పని ఆయనకు లేదు అంటూ అమర్నాథ్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

## సిఎంల భేటీ మంచి పరిణామం

**ఎపి మంత్రి సత్యకుమార్ వెల్లడి**

**విజయవాడ, జూలై6(పీపుల్స్ మోటివేషన్):**

ముఖ్యమంత్రుల భేటీపై ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్య కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల సీఎంల భేటి శుభ పరిణామమని అన్నారు. విభజన చట్టంలోని అంశాలు నీటి సమస్యలపై స్నేహపూర్వకంగా చర్చలు జరగాలన్నారు. రాజకీయాలకు తావు లేకుండా సమస్యల పరిష్కారానికి సీఎంలు ముందుకు రావడం అభినందనీయ మన్నారు. రెండు ప్రాంతాల మధ్య వైశమ్యాలు పెంచుతూ కేసీఆర్ అధికారంలోకి వచ్చారని విమర్శించారు. కేసీఆర్ విద్వేషపూరితమైన వాతావరణాన్ని నెలకొల్పారని మండిపడ్డారు. ఇప్పటి వరకు రాజకీయ లబ్ది కోసం ప్రయత్నించారన్నారు. గతంలో ముఖ్యమంత్రుల సహకారం లేక కేంద్రం ఏమీ చెయ్యలేక పోయిందని తెలిపారు. చట్టప్రకారమే అన్ని పంపకాలు జరగాలన్నారు. చట్టాన్ని కాదని డిమాండ్లు పెడితే దానిపై చర్చ జరగాలన్నారు. లక్ష పదివేల కోట్ల అప్పుతో ఏపీ ఉందని.. అన్యాయం జరిగింది ఏపీకే అని చెప్పుకొచ్చారు. రాజధాని లేని రాష్ట్రం ఏపీ అని అన్నారు. డిమాండ్లు పెట్టడంలో తప్పులేదు కానీ అత్యాశపరమైన డిమండ్లు కరెక్ట్ కాదన్నారు. అన్ని సమస్యలను ఇద్దరు కలిసి పరిష్కరించుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు అన్యాయం జరిగిన రాష్ట్రం ఏపీ వైపే కేంద్రం ఉందన్నారు. పోలవరం, రైల్వే జోన్‌కు కేంద్రం సహకారం ఉందని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.

## నీట్ యూజి కౌన్సిలింగ్ వాయిదా

**తదుపరి ఉత్వర్వులు ఇచ్చేవరకు నిలిపివేత**

**న్యూఢిల్లీ,జూలై6(పీపుల్స్ మోటివేషన్):**

వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ 2024 పరీక్షలో అక్రమాల వ్యవహారం తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ వివాదం వేళ నీట్ యూజీ కౌన్సెలింగ్‌ను జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ వాయిదా వేసింది. వాస్తవానికి ఈ కౌన్సెలింగ్ పక్రియ శనివారం నుంచే ప్రారంభం కావాల్సి ఉండగా.. తదుపరి నోటీసులు ఇచ్చేంత వరకు దాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. కొత్త తేదీలను కేంద్ర విద్యాశాఖ త్వరలోనే ప్రకటిస్తుందని తెలిపింది. కాగా.. నీట్ కౌన్సెలింగ్‌ను వాయిదా వేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించినప్పటికీ ఎన్‌టీఏ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఈ ఏడాది మే 5వ తేదీన దేశవ్యాప్తంగా నీట్ యూజీ 2024 పరీక్ష నిర్వహించారు. అయితే పరీక్ష పేపర్ లీక్ అవడంతో పాటు పరీక్ష నిర్వహణలో అవకతవకలు చోటుచేసుకున్నట్లు వార్తలు రావడంతో దేశవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. ఫలితాల్లో ఏకంగా 67 మందికి జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు రావడంపైనా పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. నీట్ అభ్యర్థుల్లో 1563 మందికి గ్రేస్ మార్కులు కలపడం, ఓఎంఆర్ షీట్లు అందకపోవడం, న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు సహా నీట్‌ను రద్దు చేయాలన్న డిమాండ్లతో సుప్రీం కోర్టులో దాదాపు 26 పిటిషన్లు దాఖలయ్యాయి. నీట్-యూజీ పరీక్షను రద్దు చేయడం హేతుబద్ధం కాదు. దీనిపై గతంలో విచారణ జరిపిన న్యాయస్థానం.. కౌన్సెలింగ్ వాయిదా వేయాలన్న పిటిషనర్ల అభ్యర్థులను తోసిపుచ్చింది. మరోవైపు, సుప్రీం ఆదేశాల మేరకు ఇటీవల గ్రేస్ మార్కులు కలిపిన విద్యార్థులకు మళ్లీ పరీక్ష నిర్వహించి సవరించిన నీట్ ర్యాంకుల జాబితాను ఎన్‌టీఏ విడుదల చేసింది. ఈ క్రమంలోనే అక్రమాల ఆరోపణలపై కేంద్రం, ఎన్‌టీఏ శుక్రవారం సర్వోన్నత న్యాయస్థానానికి అఫిడవిట్లు సమర్పించాయి. నీట్-యూజీ పరీక్షను రద్దు చేయడం వల్ల నిజాయతీ కలిగిన లక్షల మంది అభ్యర్థులు నష్టపోతారని కేంద్రం సుప్రీంకోర్టు (÷ూబూస।ప। అనీబీసబి)కు తెలిపింది. పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు రుజువులు లేనప్పుడు ఆ చర్య చేపట్టడం హేతుబద్ధం కాదని స్పష్టం చేసింది. ఈ పిటిషన్లపై జులై 8న తదుపరి విచారణ జరగనుంది. ఈ పరిణామాల వేళ కౌన్సెలింగ్‌ను వాయిదా వేయడం గమనార్హం.

# 22నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

**ఆగస్టు 12 వరకు బడ్జెట్ సమావేశాలు**

**23న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న నిర్మలా సీతారామన్**

**వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు**




**న్యూఢిల్లీ,జూలై6(పీపుల్స్ మోటివేషన్):**

సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో విజయం సాధించి, నరేంద్రమోదీ నేతృత్వంలో మూడోసారి ఎన్డీయే కూటమి కొలువుదీరిన వేళ..ఇటీవలే పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం జులై 23న బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగానూ ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మరోమారు బడ్జెట్‌ను సమర్పించనున్నారు. ఈ విషయాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ నేపథ్యంలో జులై 22 నుంచి ఆగస్టు 12 వరకు బడ్జెట్ సమావేశాలు జరుగుతాయని తెలిపారు. ఎన్నికల సంవత్సరం కావడంతో ఈ ఏడాది ఫిబ్రవరి 1న నిర్మలమ్మ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో పూర్తి స్థాయి బడ్జెట్‌ను తీసుకొస్తున్నారు. మోదీ 3.0లో ప్రవేశపెట్టనున్న తొలి బడ్జెట్ ఇదే. దీంతో వరసగా ఏడుసార్లు బడ్జెట్ సమర్పించిన ఘనతను నిర్మలా సీతారామన్ అందుకోనున్నారు. ఇప్పటి వరకు మొరార్జీ దేశాయ్ వరసగా ఆరుసార్లు బడ్జెట్ సమర్పించారు. 2019లో రెండోసారి మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీతారామన్‌కు ఆర్థిక శాఖ బాధ్యతలు అప్పగించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ తర్వాత బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండో మహిళగా గుర్తింపు పొందారు. ఎప్పటిలా సూట్‌కేసులో కాకుండా రాజముద్ర ఉన్న ఎరుపు రంగు వస్త్రంలో బడ్జెట్ ప్రతులను తీసుకొచ్చే కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు బడ్జెట్ సమర్పణ తేదీలను కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శనివారంనాడు ప్రకటించారు. జూలై 22వ తేదీన బడ్జెట్ సమావేశాలు ప్రారంభమై ఆగస్టు 12వ తేదీతో ముగుస్తాయని,బడ్జెట్ సమావేశాల రెండో రోజైన జూలై 23న కేంద్రబడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెడతారని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మంత్రి తెలిపారు. భారత ప్రభుత్వం సిఫారసుల మేరకు పార్లమెంటుబడ్జెట్ సమావేశాలు జరిపేందుకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. 2024-25 కేంద్ర బడ్జెట్‌ను జూలై 23వతేదీన లోక్‌సకు సమర్పిస్తాం' అని రిజిజు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెడుతున్న తొలి బడ్జెట్ ఇదే కావడం విశేషం. ఈసారి బడ్జెట్‌లో పలు చారిత్రక నిర్ణయాలు తీసుకోనున్నారనే అంచనాలు కూడా బలంగానే ఉన్న నేపథ్యంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టే బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## బిఆర్‌ఎస్‌కు వరుస షాక్‌లు

**తలలు పట్టుకుంటున్న బిఆర్ఎస్ నేతలు**

**ఎవరు పార్టీ వీడుతారో అర్థం కాని పరిస్థితి**

**సైలెంట్‌గా చేరిపోయిన బండ్ల కృష్ణమోమన్ రెడ్డి**

**హైదరాబాద్,జూలై6(పీపుల్స్ మోటివేషన్):**

తెలంగాణలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఊహించని పరిణామాలే చోటుచేసుకుంటున్నాయి. ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కీలక నేతలు ఎప్పుడు గులాబీ కండువా తీసేసి.. కాంగ్రెస్ కండువా కప్పుకుంటారో తెలియని పరిస్థితి ఉంది. ఇప్పటికే ఆరుగురు ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు కారు దిగి హస్తం గూటికి చేరడం.. మరో ఆరుగురు ఎమ్మెల్యేలు రెడీగా ఉన్నారనే వార్తలతో పార్టీ పరిస్థితి ఏంటనేది హైకమాండ్‌కే తెలియక తలలు పట్టుకుంటోంది..! ఈ క్రమంలో గద్వాల ఎ మ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కూడా సిఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అయితే మూకుమ్మడిగా కాకుండా ఒకకొక్కరుగా పార్టీని వీడడం అర్థం కావడం లేదు. సరిగ్గా ఈ క్రమంలోనే తెలంగాణ భవన్ వేదికగా జరుగుతున్న బీఆర్ఎస్ కీలక సమావేశానికి పార్టీ సీనియర్ ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశం అవుతోంది. అసలే మరో ఆరుగురు గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకోవడానికి రంగం సిద్ధం చేసుకున్నారనే వార్తల నేపథ్యంలో భేటీ జరగడం.. ఈ సమావేశానికి కొందరు ఎమ్మెల్యేలు రాకపోవడంతో ఏదో తేడా కొడుతోందనే అనుమానాలకు తావిచ్చినట్లయ్యింది. తొలిరోజు సమావేశానికి రాలేదు సరే.. రెండో రోజు కూడా హాజరుకాకపోవడంతో పార్టీ మార్పు పక్కా అనే వార్తలు గుప్పుమంటున్నాయి. జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం జరుగనున్న నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై శుక్రవారం నాడు తెలంగాణ భవన్‌లో వేదికగా కీలక సమావేశం నిర్వహించడం జరిగింది. అయితే.. ఈ సమావేశానికి పలువురు ఎమ్మెల్యేలు హాజరుకాకపోగా శనివారం జరిగన కౌన్సిల్ సమావేశానికి రాకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. కౌన్సిల్ భేటీకి ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, ప్రకాష్ గౌడ్, మహిపాల్ రెడ్డి డుమ్మా కొట్టారు. కౌన్సిల్ భేటీకి కచ్చితంగా హాజరుకావాలని అధిష్ఠానం నుంచి ఎమ్మెల్యేలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ హాజరుకాకపోవడం గమనార్హం. దీంతో ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు ఏమయ్యారు..? బీఆర్ఎస్‌కు బై బై చెప్పడానికి రంగం సిద్ధం చేసుకున్నారా..? లేకుంటే మరేదైనా కారణాలతో డుమ్మా కొట్టారా అనేది తెలియట్లేదు.రాష్ట్ర రాజధాని పరిధిలో బీఆర్ఎస్‌కు 14 మంది ఎమ్మెల్యేలున్నారు. వీరిలో ఏడుగురు శక్రవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశానికి రాలేదు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 24 నియోజక వర్గాలకుగాను 16 బీఆర్ఎస్ గెలుచుకుంది. కండువాల మార్పిడి సీజన్ నడుస్తోన్న సమయంలో ఒకరోజు ముందు సమాచారమిచ్చి మరీ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ మీటింగ్‌కు హైదరాబాద్‌లోనే ఉండి కూడా కొందరు ఎమ్మెల్యేలు రాకపోవడం పార్టీ మారుతారనే వార్తలకు బలం చేకూరుతోంది. నిన్నటి సమావేశానికి.. తలసాని శ్రీనివాస్‌యాదవ్ (సనత్‌నగర్), పద్మారావు (సికింద్రాబాద్), ప్రకాష్‌గౌడ్ (రాజేంద్రనగర్), సుధీర్‌రెడ్డి(ఎల్‌బీనగర్), మాగంటి గోపినాథ్(జూబ్లీహిల్స్), ముఠా గోపాల్ (ముషీరాబాద్), కాలేరు వెంకటేష్(అంబర్‌పేట) హాజరయ్యారు. అయితే.. అరెకపూడి గాంధీ(శేరిలింగంపల్లి), మాధవరం కృష్ణారావు(కూకట్‌పల్లి), బండారి లక్ష్మారెడ్డి(ఉప్పల్), మర్రి రాజశేఖర్‌రెడ్డి(మల్కాజ్‌గిరి), కేపీ వివేకానందగౌడ్ (కుత్బుల్లాపూర్), సబితా ఇంద్రారెడ్డి(మహేశ్వరం), గూడెం మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరు)లు రాలేదు. దీంతో ఇవాళ అయినా.. కౌన్సిల్‌కు వస్తారనుకుంటే రాకపోవడంతో ఏదో తేడా కొడుతోందనే మాటలు గట్టిగా వినిపిస్తున్నాయి.

## మంత్రి శ్రీధర్ బాబుతో విపక్ష ఎమ్మెల్యే భేటీ

**హైదరాబాద్,జూలై6(పీపుల్స్ మోటివేషన్):**

రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శ్రీధర్‌బాబును శనివారం భారాస ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, వివేకానందగౌడ, అరికెపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, లక్ష్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి కలిశారు. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల సంబంధించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యేలు మంత్రికి అందజేశారు. జీహెచ్ఎంసీకి నిధులు విడుదల చేయాలని కోరారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి జీహెచ్ఎంసీకి నిధులు ఇవ్వలేదని మంత్రి దృష్టికి తెచ్చారు. సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును ఈ ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కలిశారు. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## అవినీతి కేసులో గుంతకల్లు డిఆర్‌ఎం

**వినీత్ సింగ్‌ను అరెస్ట్ చేసిన సిబిఐ**

**కంట్రాక్టర్ నుంచి లంచం డిమాండ్ చేయడంతో అరెస్ట్**

**అనంతపురం,జూలై6(పీపుల్స్ మోటివేషన్):**

అవినీతి కేసులో గుంతకల్లు డీఆర్ఎం వినీత్ సింగ్‌ను సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. కడప జిల్లాకు చెందిన ఓ రైల్వే కాంట్రాక్టర్‌ను రైల్వే అధికారులు లంచం డిమాండ్ చేశారు. ఈ క్రమంలో రైల్వే అధికారులపై సీబీఐకి కాంట్రాక్టర్ రమేష్ రెడ్డి ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టర్ ఫిర్యాదు మేరకు రెండు రోజుల పాటు అధికారులు తనిఖీలు చేపట్టారు. అనంతరం గుంతకల్లు డీఆర్ఎం వినీత్‌తో పాటు, కుందా ప్రదీప్ బాబు, అక్కిరెడ్డి, బాలాజీ, లక్ష్మీపతి రాజులను సీబీఐ అదుపులోకి తీసుకుంది. గుంతకల్ రైల్వే డివిజన్ పరిధిలో జరిగిన కాంట్రాక్ట్ పనుల్లో రైల్వే అధికారులు కోట్ల రూపాయల్లో అవినీతికి పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. ఇందులో భాగంగా గుంతకల్లు డీఆర్ఎం వినీత్ సింగ్‌లతో పాటు మిగిలిన వారిని అరెస్ట్ చేసిన సీబీఐ అధికారులు.. వారిని వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు ముగిసిన అనంతరం అరెస్టు అయిన రైల్వే అధికారులను సికింద్రాబాద్ తరలిస్తున్నారు. గుంతకల్లు రైల్వే డీఆర్ఎం కార్యాలయం వివిధ విభాగాల్లో సీబీఐ సోదాలు చేసింది. రైల్వే డీఆర్ఎం వినీత్‌సింగ్ నివాసంలో తనిఖీలు పూర్తయ్యాయి. సింగ్ నివాసంలో భారీగా బంగారం, నగదు పట్టుబడింది. ఎనిమిది మంది సిబ్బందిని సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గుంతకల్లు డీఆర్ఎం వినీత్‌సింగ్, డీఎఫ్ఎం ప్రదీప్ బాబు, సిబ్బంది రాజు, ప్రసాద్, బాలాజీ సీబీఐ అదుపులో ఉన్నారు. నిందితులను వైద్య పరీక్షల నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం వారిని సీబీఐ కోర్టుకు తరలించనున్నారు. గుంతకల్లు డీఆర్ఎం కార్యాలయంలో భాగమైన ఆర్థిక విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది నివాస గృహాల్లో సికింద్రాబాద్‌కు చెందిన సీబీఐ అధికారులు తనిఖీలు చేశారు. ఆర్థిక విభాగంలో పని చేస్తున్న సీనియర్ డివిజన్ ఫైనాన్స్ మేనేజర్(డీఎఫ్ఎం) ప్రదీప్‌బాబుతో పాటు మరికొందరు సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు రావడంతో సీబీఐ అధికారులు గత మూడు రోజుల నుంచి గుంతకల్లులో మకాం వేశారు. కదిరి ప్రాంతంలో రైల్వే మోరీ పనులకు సంబంధించి ఆ ప్రాంతానికి చెందిన గుత్తేదారులకు పనిని అప్పగించడానికి ఉత్తర్వులు ఇచ్చేందుకు ప్రదీప్‌బాబుతో పాటు కొందరు సిబ్బంది డబ్బును డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో సీబీఐ అధికారులు తనిఖీ చేసి అక్రమాలకు పాల్పడుతున్న సిబ్బంది గృహాల్లో దాడి చేసి..భారీగా నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నారు.

## హత్రాస్ ఘటన దిగ్భ్రాంతి కలిగించింది

**న్యూఢిల్లీ,జూలై6(పీపుల్స్ మోటివేషన్):**

ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన హాథ్రస్ తొక్కిసలాట ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన సంగతి తెలిసిందే. దాంతో 'భోలే బాబా పేరు దేశమంతా మార్మోగిపోయింది. ఈ నేపథ్యంలో ఆయన తొలిసారి మీడియా ముందుకు వచ్చారు. ఆ దుర్ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. 'జులై 2 ఘటనతో మేం చాలా వేదనకు గురయ్యాం. ఈ క్లిష్ట సమయంలో ఆ భగవంతుడు బాధను భరించే శక్తిని ఇవ్వాలని ప్రార్థిస్తున్నాను. తొక్కిసలాటకు బాధ్యులైన వారు శిక్ష నుంచి తప్పించుకోలేరని నేను నమ్ముతున్నాను. నాకు ప్రభుత్వంపై విశ్వాసం ఉంది. మృతులు, గాయపడిన కుటుంబాలకు అండగా ఉండాలని కమిటీ సభ్యులకు సూచించాను' అని మీడియా ముందు మాట్లాడారు.అలీగఢ్‌తోపాటు హాథ్రస్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రతి మంగళవారం సత్సంగ్ పేరుతో బాబా ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతుంటారు. వేల సంఖ్యలో భక్తులు హాజరవుతుంటారు. కొన్నిసార్లు లక్షల్లో జనం వస్తుంటారు. జులై 2న హాథ్రస్‌లో నిర్వహించిన సత్సంగ్‌కు 80వేల మందికి ఏర్పాట్లు చేయగా.. రెండున్నర లక్షలమంది హాజరయ్యారు. 'సేవాదర్ ఆర్మీ'గా పిలిచే బృందం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇక ఆ రోజు ముఖ్యసేవాదర్‌గా ఉన్న దేవ్‌ప్రకాశ్ మధుకర్ శుక్రవారం రాత్రి దిల్లీలో పోలీసుల ముందు లొంగిపోయాడు. పోలీసులు నమోదుచేసిన ఎఫ్ఐఆర్‌లో అతడే ప్రధాన నిందితుడిగా ఉన్నాడు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation
ఆదివారం | జులై | 07 | 2024



# శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం

**జయంతి వేడుకల్లో స్మరించుకోవడం అదృష్టం**
**కొట్టె మల్లికార్జున బిజెపియువనాయకులు**

**నంద్యాల, జులై 06 (పీపుల్స్ మోటివేషన్):**

భారతీయ జనతా పార్టీ ఏకాత్మ మానవత సిద్ధాంత రూపకర్త మరియు స్వాతంత్ర్యం అనంతరం ఏర్పడిన నెహ్రూ తొలి క్యాబినెట్ లో భారీ పరిశ్రమల శాఖ మంత్రిగా పని చేసిన భరతమాత ముద్దుబిడ్డ శ్యాం ప్రసాద్ ముఖర్జీ మరణించి ఎన్నో సంవత్సరాలు అయినప్పటికీ ఇంకా ప్రజల గుండెల్లో, భారతీయ జనతా పార్టీ శ్రేణుల్లో అమరజీవిగా మిగిలిపోయారు. బిజెపి యువ నాయకులు కొట్టె మల్లికార్జున మీడియాతో మాట్లాడుతూ భారత దేశంలో ఒకటే జెండా ఒకే రాజ్యాంగం ఉండాలని జమ్మూ కాశ్మీర్ విషయంలో జవహర్ లాల్ నెహ్రూతో విభేదించి భారతీయుల కోసం తన ప్రాణాలను సైతం బలి దానం చేసిన మహనీయులు శ్యాం ప్రసాద్ ముఖర్జీ దేశానికి ఆదర్శం అయ్యారు. అలాంటి మహనీయుని జయంతి వేడుకలు సందర్భంగా స్మరించుకోవడం ఆనందంగా ఉంది అని పేర్కొన్నారు. భారత దేశంలో ఉన్న ప్రజలందరూ, భారతీయులందరూ ఒక్కటే అని ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ నినాదాన్ని నినదించిన శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆలోచన విధానాన్ని వరుసగా మూడవసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ ప్రజా సంక్షేమం కోసం కృషి చేసి చూపించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్రంలో నరేంద్ర మోడీ సారథ్యంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం యొక్క లక్ష్యం సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ మాత్రమే కాదు బిజెపి పార్టీ జాతీయ, రాష్ట్రీయ నాయకత్వాలు సైతం ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తూ ప్రజా పరిపాలన కొనసాగిస్తున్నాయి అని బిజెపి యువ నాయకులు కొట్టె మల్లికార్జున మీడియాతో పేర్కొనడం జరిగింది.



# బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం

**ఘనంగా 39వ, వర్ధంతి వేడుకలు పలు సేవా కార్యక్రమాలు చేపట్టిన**
**జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిడిశెట్టి రాజు**

**సిద్దిపేట, జూలై 06 (హుస్నాబాద్ భార్గవాపురం):**

భారత స్వాతంత్ర్య సమరయోధులు సంఘసంస్కర్త బాబు జగ్జీవన్ రామ్ 39వ, వర్ధంతి వేడుకలు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో నిర్వహించగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. హాస్పిటల్ లోని రోగులకు పండ్లు, బ్రేడ్ పంపిణీ చేశారు. మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రాం ఏప్రిల్ 5, 1908 న, బీహార్ రాష్ట్రంలో జన్మించాడు. తల్లిదండ్రులు వసంతీదేవి, శోభీరామ్. ఈయన స్వాతంత్ర్య సమరయోధుడు మరియు సంఘ సంస్కర్త బీహార్ లోని వెనుకబడిన వర్గాల నుంచి వచ్చాడు. క్విట్ ఇండియా ఉద్యమంలో జగ్జీవన్‌రామ్ చురుగ్గా పాల్గొన్నారు. బీహార్‌లో గొప్ప ప్రజా ఉద్యమాన్ని నడిపాడు. జగ్జీవన్‌రామ్ ఈ సమయంలో బ్రిటిష్ ప్రభుత్వ అణచివేతల్ని ఖండిస్తూ దేశ స్వాతంత్ర్య సాధనకోసం అనేక సభా, సమావేశాలు, ర్యాలీలను నిర్వహించాడు. స్వాతంత్ర్యం అనంతరం భారత పార్లమెంటులో నలభై ఏళ్ళపాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించడమే కాకుండా ఉప ప్రధానిగా కూడా వ్యవహరించారు. జగ్జీవన్‌రామ్ గొప్ప రచయిత ఈయన హిందీలో, ఇంగ్లీషులో రచనలు చేశారు. భారతదేశంలో కుం సవాళ్ళు జీవన సరళి వ్యక్తిత్వ వికాసం అను రెండు విశిష్ట గ్రంథాలను జగ్జీవన్‌రామ్ రాశారు. ఆయన గొప్ప సమ్మోహన శక్తి గల వక్త. విస్తృత అధ్యయనశీలి. ఉజ్జయినిలోని విక్రమ విశ్వవిద్యాలయం జగ్జీవన్‌రామ్‌కి 'డాక్టర్ ఆఫ్ సైన్స్' గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. ప్రజలు జగ్జీవన్‌రామ్ ను ప్రేమగా 'బాబూజీ' అని పిలిచేవారు. 1986 జూల్కె 6వ తేదీన బాబూజీ భౌతికంగా మనను వీడారు. యావత్తు భారతజాతి ఘనంగా నివాళులర్పించింది. ఇలాంటి స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని రాజు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు ముంజ మల్లయ్య గౌడ్, మహాత్మా జ్యోతి రావు పూలే, అంబేద్కర్ నవ నిర్మాణ సమితి రాష్ట్ర నాయకులు ఎనగందుల కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా బాబు జగజీవన్ రామ్ వర్ధంతి వేడుకలు



**బేతంచర్ల, జూలై 06 (పీపుల్స్ మోటివేషన్):-**

బేతంచర్ల పట్టణంలోని డోన్ క్రాస్ రోడ్డు లో బాబు జగజీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు ఈ సందర్భంగా మాల మహానాడు సంఘ నాయకులు మేకల నాగరాజ్, రూబెన్ లు మాట్లాడుతూ దేశ సమగ్ర ఐక్యతకు జాతీయ ఐక్యతకు కృషి చేసిన మహెూన్నత వ్యక్తి అని అలాగే ఆయన భారత తొలి ఉపరాష్ట్రపతి గాను రాజ్యాంగ అమలు కోసం చట్టసభలలోను పోరాటం చేశారు బడుగు బలహీన వర్గాల కోసం అభివృద్ధి కోసం రాజ్యాంగంలో కల్పించిన హక్కుల కోసం కృషి చేశారని వారన్నారు ఈ కార్యక్రమంలో నాగరాజు, గోరంట్ల, నంద్యాల మధు, రామ సుబ్బయ్య, చిన్న పోగుల రాముడు, తదితరులు పాల్గొన్నారు.

# దెయ్యాలు వేదాలు వల్లిం చినట్లుంది ఎమ్మెల్యే జయసూరి గారు..



**నందికొట్కూరు, జులై 06 (పీపుల్స్ మోటివేషన్):-**

పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లిం మహిళను అవమాణించిన వైసీపీ కో - అప్షన్ సభ్యుడు శ్రీనివాసరెడ్డిని ఎన్నికల ముందు టీడీపీలో చేర్చుకున్న నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూరి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో మున్సిపాలిటీలో చైర్మన్ తో పాటు 20 మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరితే అది పెద్ద నేరమైనట్లు అవాకులు, చావాకులు మాట్లాడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్. కాకరవాడ చిన్న వెంకటస్వామి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ అబ్దుల్ సుకురూ, బి. సి సెల్ మహిళా అధ్యక్షురాలు శైలజాలు అన్నారు. శనివారం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న టీడీపీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దొంగే దొంగ అన్నట్లుంది ఎమ్మెల్యే జయసూర్య మాటలు ఉన్నాయని వారు విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరుతున్నారని, అందులో భాగంగానే నందికొట్కూరు నియోజకవర్గంలో బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారని, నీ చేతగానితనం కప్పి పుచ్చుకునేందుకు బైరెడ్డి పై ఆరోపణలు చేయడం మంచిదికాదని నీపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిర్యాదు చేస్తున్నామని వారు వివరించారు. ఇటీవల తాము అమరావతి టీడీపీ కేంద్ర కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసిపార్లమెంట్ టీడీపీ ఇంచార్జినీ అంటూ మాండ్ర శివానందరెడ్డి ప్రచారం చేసుకుంటున్నారని చెప్పగా ఎంపీ లుగా గెలిచాం, ఇంకా పార్లమెంట్ ఇంచార్జిలేంటని ప్రశ్నించారని, ఆ పదవులు ఎన్నికల తర్వాత రద్దు అయ్యాయాని ముఖ్యమంత్రి చెప్పారని వారు వివరించారు. హుందాగా ఎమ్మెల్యే పదవికి గౌరవం తేవాలని, ఎమ్మెల్యే పదవికి మచ్చ తీసుకురావద్దని ఎమ్మెల్యే జయసూర్యకు వారు హితవు పలికారు. మరో సారి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డిపై నోరు పారేసుకుంటే ఎమ్మెల్యే అని చూడకుండా తగిన బుద్ధిచెబుతామని టీడీపీ నాయకులు ఎమ్మెల్యే జయ సూర్యను హెచ్చరించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ముజిపర్ రహేమాన్, అబ్దుల్లా, జనార్ధన్ నాయుడు, యస్వంత్, దళిత నాయకులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన మరో బిఆర్ఎస్ ఎమ్మెల్యే

**బండ్లను కండువా కప్పి ఆహ్వానించిన సిఎం రేవంత్**

**హైదరాబాద్,జూలై6(పీపుల్స్ మోటివేషన్):**

ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ఖాతా కూడా తెరవని బీఆర్ఎస్ కు వరుస షాకులు తగులుతున్నాయి. మొన్న ఆరుగురు ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ చేరగా... తాజాగా మరో ఎమ్మెల్యే కాంగ్రెస్ గూటికి చేరారు. గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి శనివారం ఉదయం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏఐసీసీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షి, సీఎం రేవంత్ రెడ్డిల సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. కాంగ్రెస్ లోకి బండ్ల చేరికతో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఒక్క అలంపూర్ స్థానం మినహా బీఆర్ఎస్ ఖాళీ అయ్యింది. అలంపూర్ నుండి విజయుడు బీఆర్ఎస్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు ఏడురుగు ఎమ్మెల్యేలు చేయిని అందిపుచ్చుకున్నారు.

# వసతులు లేని నర్సింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోండి

**ఎర్రి స్వామి ఏబివీపీ జాయింట్ సెక్రటరీ**



**అమరావతి, జులై 06 (పీపుల్స్ మోటివేషన్):-**

శనివారం రోజు ఏబివీపీ జాయింట్ సెక్రటరీ ఎర్రి స్వామి మాట్లాడుతూ..డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్నటువంటి నర్సింగ్ కళాశాలల యొక్క మౌలిక వసతులు మరియు టీచర్స్, ప్రాక్టికల్, లేనటువంటి కళాశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని నిరుపేద విద్యార్థుల నుంచి వేల కొలది ఫీజులను వసూలు చేస్తూ వారి కోర్సులు అనంతరం సర్టిఫికెట్లను ఇవ్వకుండా కళాశాలలో చుట్టూ తిప్పించుకుంటున్న వైనం ఈ కర్నూలు జిల్లాలో అధికంగా అయిందని తెలియజేస్తూ.. డాక్టర్ వైయస్సార్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్టర్ డాక్టర్ రాధిక రెడ్డి కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రిజిస్టర్ డాక్టర్ రాధిక రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ.. అలాంటి వాటిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ప్రభుత్వ సలహాదారుగా కెకె

**హైదరాబాద్,జూలై6(పీపుల్స్ మోటివేషన్):**

మాజీ ఎంపీ, సీనియర్ నేత కే.కేశవరావు ప్రభుత్వ సలహాదారుగా నియమితులయ్యారు. ఆయనకు కేబినెట్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. బీఆర్ ఎస్ పార్టీలో సీనియర్ లీడర్ గా, కేసీఆర్ కు సన్నిహితుడిగా కొనసాగిన కేకే .. ఈ మధ్యే ఎఐసిసి చీఫ్ మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. తర్వాత రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. కేకే కూతురు జిహెచ్ఎంసి మేయర్ గా ఉన్న గద్వాల్ విజయలక్ష్మి కూడా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన సంగతి తెలిసిందే. కెకె రాజ్యసభ ఎంపీగా తన పదవీకాలం ఇంకా రెండేండ్లు మిగిలి ఉండగానే రాజీనామా చేశారు. తాను బీఆర్ఎస్ పార్టీ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యానని... ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో నైతిక విలువలకు కట్టుబడి రాజీనామా చేశాను అని తెలిపారు. 2026 ఏప్రిల్ 9 వరకు రాజ్యసభ ఎంపీగా కేకే పదవీకాలం ఉంది. బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్‌గా పని చేసిన కేకే..జూలై 3న కాంగ్రెస్‌లో చేరారు. గతంలో కాంగ్రెస్ లోనే సుదీర్ఘకాలం ఉన్న ఆయన.. పీసీసీ చీఫ్‌గా పని చేశారు.

# ఇంద్రకీలాద్రిపై ఆషాఢ ఉత్సవాలు

**తొలిసారెను సమర్పించిన వైదిక కమిటీ**

**విజయవాడ,జూలై 6(పీపుల్స్ మోటివేషన్):**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ సన్నిధిలో ఆషాడ మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈరోజు నుంచి ఆగస్టు 4 వరకు ఈ మాసోత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారికి వైదిక కమిటీ సభ్యులు తొలిసారెను సమర్పించారు. మేళ తాళాలతో మంగళ వాయిద్యాలతో అమ్మవారికి కమిటీ సభ్యులు సారెను సమర్పించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్, చలిమిడి, గోరింటాకును భక్తులు సమర్పించారు. ఆషాడ మాసం తొలిరోజు కావడంతో ఇంద్రకీలాద్రి భక్తులతో కిక్కిరిసింది. ఆషాడ మసోత్సవాల సందర్భంగా నెలరోజుల పాటు ఇంద్రకీలాద్రి భక్తులతో కిటకిటలాడనుంది. అలాగే అమ్మవారికి శివస్వామి సారెను సమర్పించారు. 116 మంది భక్తులతో కలిసి వచ్చి అమ్మవారికి సారెను సమర్పించారు. ఆషాడ మాసం నెలరోజుల పాటు అమ్మవారికి భక్తులు సారెను సమర్పించనున్నారు. ఆషాడ మాసోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. దుర్గమ్మను సారెను సమర్పిం చేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.

# దేవభూమిలో వరదబీభత్సం

**కొండచరియలు విరిగి ఇద్దరు మృతి**
**హైదరాబాద్‌కు చెందిన వారిగా గుర్తింపు**

**నైనిటాల్,జూలై6(పీపుల్స్ మోటివేషన్):**

దేవభూమిగా పేరొందిన ఉత్తరాఖండ్‌ను వర్షాలు ముంచెత్తుతున్నాయి. దీంతో పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. చమోలీ జిల్లాలో చోటుచేసుకున్న ఘటనలో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యాత్రికులు మృతిచెందినట్లు అక్కడి పోలీసులు వెల్లడించారు. కర్ణప్రయాగ, గౌచర్ మధ్యలోని బద్రీనాథ్ నేషనల్ హైవేపై శనివారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన నిర్మల్ షాహీ (36), సత్య నారాయణ (50) బద్రీనాథ్ ఆలయాన్ని దర్శించుకుని బైక్‌పై తిరిగొస్తుండగా.. మార్గమధ్యంలో కొండచరియలు విరిగి వారిపై పడ్డాయి. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను శిథిలాల నుంచి బయటకు తీసి పోస్ట్‌మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. భారీ వర్షాల కారణంగా ఉత్తరాఖండ్ వ్యాప్తంగా ప్రధాన నదులన్నీ ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. అటు కొండచరియలు విరిగిపడటంతో బద్రీనాథ్ నేషనల్ హైవే పలు చోట్ల ధ్వంసమై రాకపోకలు నిలిచిపోయాయి. రుద్రప్రయాగ్-కేదార్‌నాథ్ జాతీయ రహదారిపై కూడా రాకపోకలను నిలిచాయి. శని, ఆదివారాల్లోనూ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. ముందజాగ్రత్త చర్యగా రుద్రప్రయాగ్‌లో అన్ని స్కూళ్లకు నేడు సెలవు ప్రకటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# సింగరేణికి ఒడిశా గనులు

**హైదరాబాద్, జులై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
ఎన్నో ఏళ్లుగా సింగరేణి ఎదుర్కొంటున్న సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. ఆగష్టు 13, 2015న 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఒడిశాలోని నైనీ బొగ్గు గనిని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(ఎస్‌సీసీఎల్)కు కేటాయించింది కేంద్ర ప్రభుత్వం. అయితే అక్టోబర్ 2022లో స్టేజి-2 ఫారెస్ట్ క్లియరెన్స్ అందిన తర్వాత అటవీ భూమిని అప్పగించడంలో ఒడిశాకు చెందిన నైనీ బొగ్గు గని తీవ్ర జాప్యాన్ని ఎదుర్కొంటుంది. దీని వల్ల గని కార్యాచరణలో కూడా అసాధారణమైన ఆలస్యం కలుగుతోంది.ఈ సమస్య ఇటీవల కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి వెళ్లడంతో.. ఆయన వెంటనే ఒడిశా ప్రభుత్వంతో విస్తృత స్థాయి చర్చలు జరిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను పరిష్కరించి, గనిని వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు ఒడిశా ప్రభుత్వం సహకరించాలని కోరారు. ఒడిశా ప్రభుత్వం కూడా దీనికి అంగీకారం తెలపడంతో జులై 4న, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు 643 హెక్టార్ల అటవీ భూమిని అప్పగించడానికి ఆమోదం వచ్చింది. ఈ సమస్యను త్వరతగిన పరిష్కరించడంలో సహాయపడిన ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాంఝీకి ధన్యవాదాలు తెలిపారు కిషన్ రెడ్డి. త్వరలోనే ఎస్‌సీసీఎల్ గని నుంచి ఉత్పత్తిని ప్రారంభిస్తుందని.. తద్వారా తెలంగాణ ఇంధన భద్రత అవసరాలు మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు కేంద్రమంత్రి.

# రిషి సునాక్ ఫేర్ వెల్ స్పీచ్

**లండన్, జులై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
బ్రిటన్ ప్రధాని పదవి నుంచి రిషి సునాక్ తప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఎమోషనల్ స్పీచ్ ఇచ్చారు. దేశం కోసం ఎంతో చేశానని, ప్రజలు ప్రభుత్వ మార్పుని కోరుకున్నారని వెల్లడించారు. తనపై దేశ ప్రజలు ఎంత కోపంగా ఉన్నారో ఈ ఫలితాల ద్వారా అర్థమైందని చెప్పారు. ఈ సమయంలో రిషి సునాక్ వెనకే నిలబడ్డారు ఆయన సతీమణి అక్షతా మూర్తి. రిషి సునాక్ స్పీచ్‌తో పాటు అక్షతా మూర్తి వేసుకున్న డ్రెస్ కూడా వైరల్ అవుతోంది. డ్రెస్ కలర్ నుంచి డిజైన్ వరకూ సోషల్ మీడియాలో పెద్ద డిస్కషనే జరుగుతోంది. కొందరైతే ఈ డ్రెస్ కాస్ట్ గురించీ పోస్ట్‌లు పెట్టారు. ఒక్కొక్కరూ ఒక్కో విధంగా సెటైర్లు వేశారు. "ఆమె డ్రెస్‌ని జాగ్రత్తగా పరిశీలిస్తే ఓ విమానం కనిపిస్తుంది. అది కాలిఫోర్నియా వెళ్తోంది" అంటూ ఓ నెటిజన్ కామెంట్ చేశాడు.అంతే కాదు. ఆమె డ్రెస్ QR కోడ్‌లా ఉందని మరి కొందరు ఫన్నీగా కామెంట్స్ చేశారు. ఇక ఈ డ్రెస్ ధర 395 పౌండ్లు. అంటే మన కరెన్సీలో రూ.42 వేలు. యూకే ప్రధాని బాధ్యతలు చేపట్టిన తొలి సంపన్నుడిగా రికార్డు సృష్టించారు రిషి సునాక్. ఆయన భార్య అక్షతా మూర్తి ఇన్ఫోసిస్ ఫౌండర్ నారాయణ మూర్తి కూతురు. యూకేలో ఈ ఇద్దరికీ విలాసవంతమైన భవనాలున్నాయి. ఈ జంట గురించి ప్రతి వార్తా వైరల్ అవుతూనే ఉంటుంది. రిషి సునాక్ ఫేర్‌వెల్ స్పీచ్ ఇస్తుండగా వెనకాల చేతిలో గొడుగుతో నిలబడ్డారు అక్షతా మూర్తి. ఆ గొడుగు గురించి కూడా నెటిజన్లు రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు.

# నేతన్నల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

**నేత పరిశ్రమ యజమానులు ఆసాములు కార్మికులతో సమావేశంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా..**

**రాజన్న సిరిసిల్ల, జులై 6 (పీపుల్స్ మోటివేషన్) :**



జిల్లాలోని నేతన్నల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. సిరిసిల్ల పవర్ లూం సమస్యలపై చర్చించేందుకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో పరిశ్రమ యజమానులు, ఆసాములు, కార్మికులతో శనివారం సమావేశం చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై పరిశ్రమలో నెలకొన్న సమస్యలు, కార్మికులకు ఉపాధి, భవిషత్ కార్యాచరణ పై కాటన్, పాలిస్టర్, సైజింగ్, కార్మిక సంఘాల నాయకుల అభిప్రాయాలు తీసుకున్నారు. పవర్లూమ్ పరిశ్రమకు విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలని, పాత బకాయిలు మాఫీ చేయాలని, బతుకమ్మ చీరల బకాయిలు విడుదల చేయాలని, కామన్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని, క్లాత్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టాలని, యువతకు ఆధునిక టెక్నాలజీ పై శిక్షణ ఇప్పించాలని, సబ్సిడీ పై ఆధునిక పవర్ లూం యంత్రాలు ఇవ్వాలని, యారన్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని, బకాయి ఉన్న విద్యుత్ బిల్లులు మాఫీ చేయాలని, నూతన క్లాత్ ఉత్పత్తుల ఆర్డర్లు ప్రభుత్వం ఇవ్వాలని వారు కోరారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. నేత కార్మికుల సమస్యలపై చర్చించిన అంశాలు అన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, పరిశ్రమలో వచ్చిన సమస్యలు పరిష్కరిస్తామని, త్వరలో మరో సమావేశం ఏర్పాటు చేసి భవిషత్ కార్యాచరణ నిర్ణయిస్తామని తెలిపారు. పరిశ్రమను యథావిధిగా కొనసాగించాలని కోరారు. ఈ సమావేశంలో చేనేత జౌళి శాఖ ఆర్ డీడీ రాఘవ రావు, ఏడీ సాగర్, పరిశ్రమ యజమానులు, ఆసాములు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆ ఉపాధ్యాయుల బదిలీలకు కోర్టు వెంటనే అనుతివ్వాలి

**గడిపె మల్లేశ్ సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు**
**హుస్నాబాద్, జులై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయ ఉద్యోగుల బదిలీల ప్రక్రీయపై స్టేలు ఇచ్చి దాదాపు సంవత్సరం కాలం పాటు ఆ ప్రక్రీయను ఆపేసిన ఉన్నత న్యాయస్థానం విద్యార్థుల శ్రేయస్సు నిమిత్తం టీచర్ల బదిలీలు, పదోన్నతుల్లో జోక్యం చేసుకోమని చెప్పడం హర్షించదగిన విషయమని అన్యాయం జరిగిన ఉద్యోగులకు న్యాయం చేయాలని ఆదేశిస్తూనే విద్యావ్యవస్థ విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని న్యాయం చేస్తామని వాఖ్యానించడం శుభ పరిణామమని చెప్పడం పట్ల సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు హుస్నాబాద్ మాజీ వైస్ ఎంపిపి గడిపె మల్లేశ్ హర్షం వ్యక్తం చేశారు. మరి మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలు ఇంకేప్పుడు? 2013 నాటి నుండి నేటి వరకు 11 ఏళ్ళ పాటు కనీసం బదిలీలకు కూడ నోచుకోని మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలు గత సంవత్సరం 2023 జూలైలో10 ఏళ్ళ తర్వాత ప్రభుత్వం మోడల్ స్కూల్ టీచర్ల బదిలీల ప్రక్రియను ప్రారంభించి దాదాపు పూర్తి అయ్యే సమయంలో కొందరు ఉపాధ్యాయులు కోర్టుకు వెళ్ళినందున తెలంగాణ రాష్ట్ర హై కోర్టు స్టేఇచ్చింది. ఆరునెల పాటు వాదోప వాదాలు విని 5 నెలల పాటు తీర్పు రిజర్వులో పెట్టి మళ్ళీ వారం రోజుల కింద వాదనలు విని మళ్ళీ తీర్పును రిజర్వ్ లో పెట్టడంతో టీచర్లు గత సంవత్సర కాలంగ మానసిక ఆందోళనకు గురౌతున్నారు. ఆ ప్రభావం విద్యార్థుల విద్యాభ్యాసనపై పడుతుందని గడిపె మల్లేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. పేదవర్గాల అభ్యున్నతి కోసం ఉన్నత ఆశయంతో నాటి ప్రభుత్వం ప్రారంభించిన మోడల్ స్కూల్ వ్యవస్థ దినదినం వెనకబడడం కొంత దిగ్భ్రాంతిని కలిగిస్తుందని గడిపె మల్లేశ్ అభిప్రాయపడ్డారు. గౌరవ న్యాయస్థానం ఇకనైనా వెంటనే, అవసరమైతే తమ స్వప్రయోజనాల నిమిత్తం కోర్టుకు వెళ్ళిన కొంత మంది టీచర్ల బదిలీని తీర్పు వచ్చేంత వరకు నిలిపివేసి మిగతా మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలకు వెంటనే కోర్టు అనుమతి ఇవ్వాలని గడిపె మల్లేశ్ కోరారు. విద్యా వ్యవస్థ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని న్యాయస్థానం ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలకు ఉన్న అడ్డంకులను తక్షణమే తొలగించి గత 6 ఏళ్ళుగా బదిలీలకై ఎదురు చూస్తున్న టీచర్ల సమస్య పరిష్కారానికి న్యాయ స్థానం అనుమతించాలని న్యాయ స్థానాన్ని గడిపె మల్లేశ్ విజ్ఞప్తి చేసారు.

# అట్టహాసంగా ఆషాడ మాస బోనాల ఉత్సవాలు

**హైదరాబాద్, జులై 6 (పీపుల్స్ మోటివేషన్) :**



తెలంగాణ ఆషాడ మాస బోనాల దశాబ్ది ఉత్సవాలను ఆర్భాటంగా, అట్టహాసంగా, అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ తెలిపారు. శనివారం బేగంపేట హరిత టూరిజం ప్లాజాలో బోనాల దశావృత్సవాలు -2024 ఏర్పాట్లకు సంబంధించిన చెక్కులను దేవాలయాల కమిటీలకు పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ, హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. తెలంగాణ బోనాల జాతర ప్రతి సంవత్సరం జరుగుతుందని, గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఆర్భాటంగా, అట్టహాసంగా,అత్యంత వైభవితంగా నిర్వహించేందుకు ఆషాడ మాస బోనాలు దశాబ్ది ఉత్సవాల నిర్వహణ కోసం గతం కంటే ఎక్కువ నిధులు రాష్ట్ర ప్రభుత్వం 20 కోట్లు కేటాయించిందన్నారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అనేక సమావేశాలు నిర్వహించడం జరిగిందన్నారు. బోనాల ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించేందుకు జూన్ 15న డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం బ్రాకెట్లో ఏమన్నా ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి లో రాష్ట్రస్థాయి అధికారులతో సమావేశం, జూన్ 20న హైదరాబాద్ కలెక్టరేట్ లో జిల్లా స్థాయి అధికారులతో సమావేశం, జూన్ 25న బల్కంపేట శ్రీ ఎల్లమ్మ దేవాలయం ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో, జూన్ 26న బేగంపేట హరిత ప్లాజాలో ఉన్నతాధికారులు, దేవాలయాల కమిటీ సభ్యులతో, జూన్ 26న గోల్కొండ కోట జగదాంబ మహంకాళి దేవస్థానంలో అధికారులు, దేవాలయ కమిటీ సభ్యులు, పీస్ కమిటీ సభ్యులతో ఆషాడ మాసం బోనాలు విజయవంతంగా నిర్వహించడానికి సమావేశాలు నిర్వహించడం జరిగిందని మంత్రి తెలిపారు. జూన్ 7 నుండి ఆగస్టు 4 వరకు నిర్వహించు ఆషాడ మాసం బోనాలు ఏ దేవాలయంలో ఏ రోజు నిర్వహిస్తారు అనే వివరాలతో కూడిన పాంప్లెట్ ను వాట్సప్ ద్వారా, ఇతర మార్గాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని కమిటీ సభ్యులకు కోరారు. జూలై 7న గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి దేవాలయంలో బోనాలు, తొట్టెల, రథం ఊరేగింపు మరియు మెట్ల పూజ, సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో ఘటోత్సవము, జులై 8న బల్కంపేట శ్రీ ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానంలో ఎదుర్కోళ్లు ఉత్సవం, సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో ఘటోత్సవం, జూలై 9న ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానంలో కళ్యాణం, సికింద్రాబాద్ సే ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో ఘటోత్సవం, జులై 10న బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానంలో చండీ హోమం, రథోత్సవం, మహంకాళి దేవాలయంలో ఘటోత్సవం, జులై 11న గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి ఆలయంలో బోనాలు, సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో ఘటోత్సవం, జూలై 12న మరియు 13 న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో ఘటోత్సవం, జూలై 14న గోల్కొండ మహంకాళి దేవాలయంలో బోనాలు, అంబర్పేట శ్రీ మహంకాళి దేవాలయంలో, జూలై 15న నుండి జూలై 17 వరకు సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయం, అంబర్పేట శ్రీ మహంకాళి దేవాలయంలో ఘటోత్సవం, జూలై 18న గోలకొండ శ్రీ జగదంబ మహంకాళి ఆలయంలో బోనాలు చండీ హోమం, పూర్ణహుతి, సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి దేవాలయం, అంబర్పేట శ్రీ మహంకాళి దేవాలయంలో ఘటోత్సవము, జూలై 19న లాల్ దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి దేవాలయం, ఉప్పు గూడ, శ్రీ మహంకాళి దేవాలయం, శ్రీ బంగారు మైసమ్మ దేవాలయం, హరి బౌలి శ్రీ అక్కన్న మాదన్న దేవాలయం శాలిబండ, మిర్యాల మండి శ్రీ మహంకాళేశ్వర దేవాలయం, గౌలిపుర శ్రీ మహంకాళి దేవాలయం, శ్రీ భారత మాత కోట మైసమ్మ దేవాలయం, హైదరాబాద్,మురాద్ మహల్ శ్రీ నల్ల పోచమ్మ దేవాలయం, శ్రీ బంగారు మైసమ్మ దేవాలయం, సుల్తాన్ షాహి శ్రీ జగదంబ దేవాలయం, రాక్షస బండ శ్రీ బంగారు మైసమ్మ దేవాలయం, సిబిఐ క్వార్టర్స్ లోని శ్రీ నల్ల పోచమ్మ దేవాలయం, అలియాబాద్ శ్రీ దర్బార్ మైసమ్మ దేవాలయం, అలీజ కోట్ల శ్రీ మహంకాళి దేవాలయం లలో కలశ స్థాపన కుంకుమార్చన, సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయం, అంబర్పేట శ్రీ మహంకాళి దేవాలయం లో ఘటోత్సావము, జూలై 21న అమ్మవారి ఘట స్వాగతం, జూలై 22న సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో రంగం భవిష్యవాణి, అంబానీ ఊరేగింపు మరియు మహా హారతి, అంబర్పేట్, కార్వాన్ ఘటోత్సవం, హోమం, జూలై 23న అంబర్పేట్, సబ్సిడీ నటరాజ్ నగర్ కార్వాన్ లో ఘటోత్సవము ఊరేగింపు కార్యక్రమాలు, జూలై 24న లాల్ దర్వాజా, ఉప్పుగూడ, హరి బౌలి శాలిబండ, మిర్యాల మండి గౌలిపుర, హైదరాబాద్ మురాద్ మహల్, సుల్తాన్ షాహి రామ్భక్షబండ, సిబిఐ క్వార్టర్స్, అలియాబాద్, అలీజాకోట్ల, అంబర్పేట్ కార్వాన్ దేవాలయాల్లో శాకాంబరి అలంకరణ దర్శనం, ఉత్సవము మరియు హోమం, జూలై 25న గోల్కొండ, అంబర్పేట్, కార్వా, ముస్లిం గంజ్ దేవాలయాల్లో బోనాలు ఘటోత్సవము హోమం, ఘట స్థాపన, జూలై 26న సబ్జీమండి, నటరాజ్ నగర్, అంబర్పేట, మిర్యాల మండి, ఉప్పు గూడ లోని దేవాలయాల్లో హోమం ఘటోత్సవము, శాంతి కళ్యాణం, జూలై 27న కార్వాన్, అంబర్పేట్, ముస్లిం గంజ్ బ్రిడ్జి, సబ్జీ మండి, నరాజనగర్, గోల్కొండ లాల్ దర్వాజా హరిబౌలి లోని దేవాలయాల్లో అభిషేకం, మైల బోనం, ఊరేగింపు, ఘటోత్సవము కళ్యాణం, జూలై 28న మురాద్ మహల్, హరి బౌలి, ముస్లిం గంజ్ బ్రిడ్జి, సబ్జి మండి, నటరాజ్ నగర్, చిలకలగూడ, ఉప్పు కూడా మిర్యాల మండి, గౌలిపుర, సుల్తాన్ షాహి, హరి బౌలి, రామ్భక్షబండ, అలియాబాద్, సిబిఐ క్వార్టర్స్, బోయిగూడ, అలిజా కోట్ల, అంబర్పేట్, కార్వాన్, చార్మినార్ ఎన్టీఆర్ నగర్, ఎల్బీనగర్ నాచారం లోని దేవాలయాలలో బోనాలు, శాంతి కళ్యాణం రంగం రథయాత్ర అభిషేకం అంబారీ ఊరేగింపు తొట్టెల ఊరేగింపు కార్యక్రమాలు, జూలై 29న హరి బౌలి, చిలుకల గూడ, ఉప్పుగూడ, లాల్ దర్వాజా, మిర్యాల మండి, హైదరాబాద్ సుల్తాన్ షాహి, ముస్లిం గంజి బ్రిడ్జి, అంబర్పేట్ లోని రంగం అంబారి ఊరేగింపు, సామూహిక ఊరేగింపు, జూలై 30న లాల్ దర్వాజా, ఉప్పుగూడ, హరి బౌలి, మిర్యాల మండి, గౌలిపుర, మురాద్ మహల్, రామ్ బక్ష బండ, సుల్తాన్ షాహి, సిబిఐ క్వార్టర్స్, అలియాబాద్ అలిజాకోట్ల లోని దేవాలయంలో అమ్మవారి పూజ, ఆగస్టు 1న గోల్కొండ శ్రీ జగదంబ మహంకాళి దేవాలయంలో బోనాలు, ఆగస్టు 4న గోల్కొండ శ్రీ జగంబ మహంకాళి దేవాలయంలో బోనాలు మరియు కుంభహారతి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. హైదరాబాద్ సాంస్కృతి సంప్రదాయాలను రాష్ట్ర, దేశవ్యాప్తంగా నిలిచేలా ఉత్సవాలను నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, తాను, రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ శ్రీధర్ బాబు అధికారులను, స్థానిక దేవాలయాల కమిటీలను భాగస్వామ్యం చేసుకుంటూ ఉత్సవాలు విజయవంతం అయ్యేలా చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఎన్ని ఏర్పాట్లు చేసిన ఉత్సవాల విజయవంతరానికి ప్రజల సహకారం కావాలన్నారు. శాంతిభద్రతలను కాపాడుతూ ఉత్సవాలను విజయవంతం చేయడానికి స్థానిక ప్రజలు భాగస్వాములు కావాలని అన్నారు. నిర్వహణలో ఎలాంటి లోటుపాటు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. అందరికీ ఆషాడ మాస బోనాలు ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రమంతా సమృద్ధిగా వర్షాలు పడి మంచి పంటలు పండాలని ప్రజలంతా సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకుంటున్నట్లు తెలిపారు. మంత్రులు. బోనాల పండుగ సందర్భంగా ఏర్పాట్ల కోసం వివిధ దేవాలయాల కమిటీ సభ్యులకు చెక్కులను పంపిణీ చేశారు. బోనాల ఉత్సవ క్యాలెండర్ కాఫీ టేబుల్ బుక్ ఈవెంట్ క్యాలెండర్, ఉత్సవాల పోస్టర్, బోనాల పండుగ పై మామిడి హరికృష్ణ రాసిన పుస్తకం, బోనాల పండుగ పై పాట సిడిని మంత్రులు కొండ సురేఖ పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించినారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్య, దేవదాయ శాఖ, సమాచార శాఖ కమిషనర్ హన్మంతరావు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటాచారి, వివిధ దేవాలయాల కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ దీప్తి కమిషనర్లు పాల్గొన్నారు.

# ఏపీ లో రాజన్న బిడ్డల మధ్య మళ్లీ వారసత్వ పోరు



**హాట్ టాపిక్ గా మారింది**

**పోటాపోటీగా వైఎస్ఆర్ జయంతి..?**
**వేడుకలు నిర్వహించునున్న జగన్-షర్మిల**

**అమరావతి, జులై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
ఏపీలో ఎన్నికలు ముగిసినా..రాజన్న బిడ్డల మధ్య పోరుమాత్రం ఆగడం లేదు. వైఎస్ఆర్ వారసత్వంపై ప్రస్తుతం అన్నా చెల్లెల్ల మధ్య రాజకీయ రచ్చ మొదలైంది. ఈ నెల 8న వైఎస్ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నాయి ఇరు పార్టీలు. ఇప్పటి వరకు అటు షర్మిల ఇటు జగన్.. ఎవరికి వారు ఇడుపుల పాయ వెళ్లి వైఎస్‌కు నివాళి అర్పించేవారు. కానీ ఇప్పుడు తొలిసారి వైఎస్ జయంతిని తనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. షర్మిల మరోవైపు ఓటమి నైరాశ్యంలో ఉన్న వైసీపీ సైతం ఈ విషయంలో తగ్గేదేలేదంటోంది. జులై 8 దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి. సంక్షోభంలో ఉన్న కాంగ్రెస్‌ను వరుసగా రెండు సార్లు అధికారంలోకి తీసుకువచ్చిన వైఎస్ఆర్ తన సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో చెరగని ముద్రవేశారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయంబర్స్‌మెంట్, 108 వంటి సేవల పేరు చెబితే ముందుగా గుర్తుకువచ్చేది వైఎస్‌ఆరే. దురదుష్టవశాత్తూ. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు వరుసగా రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొన్ని నెలలకే.. 2009 సెప్టెంబరు 2 హెలికాప్టర్ ప్రమాదంలో వైఎస్ మరణించారు. వైఎస్ రాజశేఖర రెడ్డి వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన జగన్ కాంగ్రెస్‌తో విభేదించి ఆ పార్టీ నుండి బయటకు వచ్చారు. అనంతరం తండ్రి పేరు కలిసొచ్చేలా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేశారు. 2014 ఎన్నికల్లో కొద్దిలో అధికారాన్ని అందుకోలేకపోయిన జగన్ 2019 ఎన్నికల్లో ఘనవిజయం సాధించారు. ఏపీ చరిత్రలో ఏ పార్టీకి సాధ్యం కాని రీతిలో 151 స్థానాల్లో గెలిచి అధికారాన్ని చేపట్టారు. జగన్ బలపడిన సమయంలోనే ఏపీలో కాంగ్రెస్ పార్టీ మెల్లగా అంతరించిపోయింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని విభజించిన తీరు నచ్చని ప్రజలు మెల్లగా వైఎస్సార్సీపీ వైపు మొగ్గారు. ఇప్పటికీ జగన్ పార్టీకి ఉన్న ఓటు బ్యాంక్ కాంగ్రెస్ పార్టీదే. 151 మంది ఎమ్మెల్యేలు, 22 మంది ఎంపీలతో మొన్నటి వరకూ బలంగా కనిపించిన జగన్ పార్టీ ఇప్పుడు బలహీనపడింది. 151 సీట్లతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఐదేళ్లు తిరిగే సరికి రాష్ట్ర చరిత్రలో ఏ పార్టీ కూడా ఓడిపోని రీతిలో 11 సీట్లకే పరిమితమయింది. ఇదే అదనుగా కాంగ్రెస్ పార్టీ ఏపీలో బలపడే ప్రయత్నం చేస్తోంది. ఒకప్పుడు జగనన్న వదిలిన బాణాన్ని అంటూ ఏపీలో వైసీపీ తరఫున ప్రచారం నిర్వహించిన షర్మిల. ఇప్పుడు పీసీసీ చీఫ్ హోదాలో హస్తం పార్టీని బలోపేతం చేయడానికి వ్యూహాలు రచిస్తున్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో కాంగ్రెస్ కనుమరుగైంది. ఈ క్రమంలో రాష్ట్ర పార్టీపగ్గాలను వైఎస్ షర్మిల చేపట్టారు. దీంతో పార్టీ శ్రేణుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. కానీ ఈ ఎన్నికల్లో కూడా ఆ పార్టీకి దారుణ ఓటమే ఎదరయింది. గతంతో పోలిస్తే ఓటింగ్ శాతం పెరిగినా సీట్లు మాత్రం రాలేదు. అయినా వెనకడుగు వేయని షర్మిల 2029 ఎన్నికలకు పార్టీని ఇప్పటి నుండే బలోపేతం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అందుకు వైఎస్ఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని భావిస్తున్నారు. ఇప్పటి దాకా వైఎస్ వారసత్వాన్ని, ఆయన ద్వారా వచ్చిన ఓటు బ్యాంకును కాపాడుకున్న జగన్‌కు ఇకపై గట్టి పోటీ ఇవ్వాలని భావిస్తున్నారు షర్మిల. వైఎస్ జగన్ షర్మిల ఇద్దరూ వైఎస్ రాజశేఖర రెడ్డి వారసులే. కష్టాల్లో ఉన్న అన్నకు అండగా నిలబడటం కోసం రాజకీయాల్లోకి వచ్చిన షర్మిల వైఎస్సార్సీపీ విజయం కోసం రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టారు. అయితే అన్నతో దూరం పెరగడంతో కాంగ్రెస్ గూటికి చేరిన షర్మిల. వైఎస్ తనయగా ఏపీలో కాంగ్రెస్ పార్టీకి పునర్వైభవం తెచ్చే బాధ్యతను తలకెత్తుకున్నారు. ఈ క్రమంలో ఇటీవల ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన వైసీపీ నుంచి వైఎస్ అభిమానులను గతంలో కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకుగా ఉన్న వర్గాలను తిరిగి హస్తం వైపు తీసుకువచ్చే ప్రయత్నాలు చేపట్టారు. ఈ క్రమంలో తొలి అడుగుగా తన తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలను షర్మిల ఉపయోగించుకోబోతున్నారుజులై 8న విజయవాడలో వైఎస్ రాజశేఖర రెడ్డి 75వ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలకు హాజరు కావాలని కాంగ్రెస్ అగ్రనేతలతో పాటు కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వంటి కీలక నేతలను స్వయంగా ఆహ్వానించారు షర్మిల.

## "జగ్జీవన్ జ్యోతి" పథకాన్ని ప్రవేశ పెట్టింది చంద్రబాబే: కదిరికోట ఆదెన్న

**ఎమ్మిగనూరు, జులై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
దళితుల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించి హక్కుల కోసం పోరాడిన గొప్ప యోధుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని టిడిపి నాయకులు "కదిరికోట ఆదెన్న" పేర్కొన్నారు. శనివారం ఎమ్మిగనూరు పట్టణంలో.. ఎస్సీ కాలనీ నందు స్వాతంత్ర్య సమరయోధుడు,దళితుల ఆశాజ్యోతి,మాజీ భారత ఉప ప్రధాని స్వర్గీయ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ గారి 38 వ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ సమగ్రతకు, జాతి సమైక్యతకు కృషిచేసి భారత రాజ్యాంగానికి కాపలాదారుడుగా వ్యవహరించి అణగారిన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన జగ్జీవన్ రామ్ పేరిట ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు 2014-19 తన హయాంలో.. ఎస్సీ,ఎస్టీల ఉచిత విద్యుత్ పథకానికి "జగ్జీవన్ జ్యోతి" గా నామకరణం చేసి మహనీయులను గౌరవించిన ఘనత చంద్రబాబుదే నన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కాలనీ టిడిపి సీనియర్ నాయకులు, మాజీ విద్యా కమిటీ చైర్మన్ రోజా ఆర్ట్స్ ఉసేని,టిడిపి నాయకులు సప్లయర్స్ బంగారప్ప, యస్.సాల్మన్, అల్వాల ప్రసాద్,జగతాప్ జై పాల్, పందికోన సురేష్,టి. ఈరన్న, సంధ్య పోగు రామన్న, ఎల్లప్ప,కదిరికోట ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

## దళితుల కోసం కొట్లాడిన వ్యక్తి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్

**ఎమ్మిగనూరు, జులై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
నియోజకవర్గ ఎమ్మిగనూరు టౌన్ నందు బాబు జగ్జీవన్ రామ్ 38 వ వర్ధంతి వేడుకలకు ఆయన చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించి ఈ సందర్భంగా జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ మాట్లాడుతూ..... 1908 సంవత్సరం చాంద్వానే గ్రామంలో జన్మించి,1919 ప్రాథమిక విద్య, 1920 పాఠశాల విద్య, 1931 డిగ్రీ, 1935 సంవత్సరం బీహార్ రాష్ట్రం నుంచి 27 ఏళ్ల అతి చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా గెలిచి, 1977 నుండి 1979 సంవత్సరం వరకు దేశంలోన తొలి దళిత ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ తో సాధ్యమైంది. అణగారిన వర్గాన్ని అభ్యున్నతిలోకి తీసుకొచ్చేందుకు పోరాడిన యోధుడు,జనం కోసం జీవితాన్ని సంపూర్ణంగా అంకితం చేసి, 50 ఏళ్ల రాజకీయ జీవితం పోరాటానికి అంకితం చేసి, రాజకీయ జీవితంలో ఒక్క మచ్చ లేకుండా ఆయన ప్రత్యర్థులు పార్టీలతో శభాష్ అనిపించుకొని, 1986 సంవత్సరం జూలై 06 వ తేదీన 77 ఏళ్ళ వయసులో తుది శ్వాస వదలడం జరిగినది. దళిత గిరిజనులకు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కుడికన్ను అయితే డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఎడమ కన్ను. రాబోయే రోజుల్లో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సేవలను, ఆశయాలను జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ముందుకు తీసుకువెళ్ళి, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఎమ్మిగనూరు టౌన్ లోన దళిత గిరిజనులు జనాభా ఎక్కువ ఉన్నప్పటికీ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం లేకపోవడం హాస్యాస్పదం, త్వరలో ఎమ్మిగనూరు టౌన్ నందు నాయకులను అధికారులను కలిసి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నిలబెడతామని మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో జై భీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ గంధాలం మణికుమార్, జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు టౌన్ నాయకులు బండారి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

ఆదివారం । జులై । 07 । 2024



# రాజ్ తరుణ్ కేసులో ట్విస్ట్...

**హైదరాబాద్, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
టీవల యంగ్ హీరో రాజ్ తరుణ్.. తనను మోసం చేశాడంటూ ఒక అమ్మాయి పోలీసులను ఆశ్రయించడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. లావణ్య అనే యువతి.. హీరో రాజ్ తరుణ్‌తో తాను 11 ఏళ్ల నుంచి కలిసుంటున్నానని, ఇప్పుడు ఓ హీరోయిన్ కోసం తనను వదిలేసి వెళ్లిపోయాడని ఆరోపణలు చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఒక్కసారిగా ఈ వార్త సంచలనంగా మారింది. లావణ్య చేసిన ఆరోపణలు రాజ్ తరుణ్ ఖండించాడు. కానీ లావణ్య మాత్రం తాను చెప్తుంది నిజం అని నిరూపించడం కోసం హీరోయిన్‌తో మాట్లాడిన ఫోన్ సంభాషణను లీక్ చేసింది. అవతల మాట్లాడుతున్న హీరోయిన్.. మాల్వీ మల్హోత్రా అని ఆమె పేర్కొంది. అయితే, అది ఎంతవరకు వాస్తవం అనేది తెలియాల్సి ఉంది.తను రాజ్ తరుణ్ ప్రేమలో ఉన్నారని, 11 ఏళ్లగా ఒకే ఇంట్లో కలిసే ఉంటున్నామని లావణ్య తెలిపింది. రాజ్ తరుణ్ తనను గుడిలో పెళ్లి కూడా చేసుకున్నాడని షాకింగ్ ఆరోపణలు చేసింది లావణ్య. అంతా బాగానే ఉన్నా గత కొన్నిరోజులుగా తన కో స్టార్‌తో సంబంధం పెట్టుకొని, ఇల్లు వదిలేసి వెళ్లిపోయాడని చెప్పుకొచ్చింది. దీంతో పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడనే ఆరోపణలతో రాజ్ తరుణ్‌పై కేసు పెట్టడానికి పోలీసులను ఆశ్రయించింది లావణ్య. రాజ్ తరుణ్.. తనను వెంటపడొద్దని, చంపి శవం మాయం చేస్తానని బెదిరిస్తున్నాడంటూ షాకింగ్ ఆరోపణలు చేసింది. ఆపై రాజ్ తరుణ్ కోస్టార్‌తో ఫోన్‌లో మాట్లాడిన సంభాషణను బయటపెట్టింది లావణ్య.''నీతో రిలేషన్ మొదలుపెట్టిన తర్వాత రాజ్ తరుణ్ నన్ను దూరం పెడుతున్నాడు'' అని ఫోన్‌లో చెప్పుకొచ్చింది లావణ్య. ''నువ్వు చెప్పినట్టే అతడు వింటున్నాడు. కావాలంటే రాజ్ తరుణ్‌ను వదిలేయడం కోసం నీ కాళ్లు పట్టుకోవడానికి కూడా సిద్ధమే'' అని ఫోన్లో తెలిపింది. అయినా ఆమె వినకపోవడంతో నీలాంటి అమ్మాయిలు కెరీర్‌లో ఎదగలేరు అంటూ వాదనకు దిగింది. ఈ ఆడియో సంభాషణను లావణ్య స్వయంగా బయటపెట్టింది. రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా కలిసి 'తిరగబడరాసామీ' అనే మూవీలో నటించారు. ఏవీఎస్ రవికుమార్ చౌదరీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఇంకా ప్రేక్షకుల ముందుకు రాలేదు. లావణ్య కేసు తర్వాత మాల్వీ మల్హోత్రా పేరు మారుమోగిపోతోంది. అసలు ఈ అమ్మాయి ఎవరు అని నెటిజన్లు సెర్చ్ చేయడం మొదలుపెట్టారు. 2017లో హిందీ బుల్లితెరపై ప్రచారమయిన 'ఉడాన్' అనే సీరియల్‌తో యాక్టింగ్ కెరీర్‌లో ప్రారంభించింది మాల్వీ. ఆ తర్వాత 'హోటల్ మిలాన్' అనే మూవీతో వెండితెరపై అడుగుపెట్టింది. మలయాళంలో విడుదలయిన 'అభ్యూహం'లో కూడా హీరోయిన్‌గా నటించింది. ఇప్పుడు 'తిరగబడరసామీ'తో తెలుగులో డెబ్యూ చేయనుంది. అయితే రాజ్ తరుణ్‌తో అఫైర్



అంటూ ఇంత పెద్ద కాంట్రవర్సీ జరుగుతున్నా దీనిపై స్పందించడానికి మాల్వీ మల్హోత్రా ముందుకు రాలేదు. రాజ్ తరుణ్ మాత్రం.. మాల్వీతో అఫైర్ అనే వార్తలను ఖండిస్తున్నాడు.

## జగన్ చంద్రబాబును విమర్శించడం హాస్యాస్పదం

**నెల్లూరు, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పరామర్శించేందుకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్... పిన్నెల్లికి మరిన్ని కేసుల్లో శిక్ష పడేలా సాక్ష్యం చెప్పి వెళ్లారని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఈవీయం పగులకొట్టాడని జగన్ చెప్పిన సాక్షాన్ని పరిగణలోకి తీసుకొని పిన్నెల్లిని శిక్షించాలని ఆనం కోరారు. నెల్లూరు సంతపేటలో ఆనం, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు మంత్రులు జిల్లా అభివృద్ధిపై చర్చించారు. ప్రతిపక్ష హోదా కూడా లేని జగన్ నెల్లూరు జిల్లాకు వచ్చి చంద్రబాబుని విమర్శించడం హాస్యాస్పదమని ఈ సందర్భంగా ఆనం విమర్శించారు. భవిష్యత్ లో వైఎస్సార్సీపీ మనుగడ సాధించలేదని జగన్మోహన్ రెడ్డి చెప్పి వెళ్లారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో భయపడిన వ్యాపారులు, పారిశ్రామికవేత్తలకు స్వేచ్ఛ వచ్చిందని మంత్రి నారాయణ వెల్లడించారు. నెల్లూరు, కడప జిల్లాల్లోని లే అవుట్లలో అక్రమాలు జరిగాయాన్ని చంద్రబాబు సూచించడంతో విచారణకు ఆదేశించామని చెప్పారు. ఈస్ట్ గోదావరి తోపాటు ఇతర జిల్లాల్లో టీడీఎస్ బాండల్లో జరిగిన అవినీతిపైన కమిటీ వేశామన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన సోమశిల జలాశయంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు.

## వీధి స్తంభాలు, వీధిలైట్లు ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులను తొలగించండి

**సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ ఏఈ,గ్రామపంచాయతీ కార్యదర్శికి మెమోరాండం**

**దేవనకొండ, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**



మండల కేంద్రమైన దేవనకొండ నందు వీధి స్తంభాలతో పాటు వీధిలైట్లు ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి ఎం. నరసరావు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ ఏఈ మరియు మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శికి మెమోరాండం సమర్పించడం జరిగినది. అనంతరం వారు మాట్లాడుతూ.... మండల కేంద్రమైన దేవనకొండ నందు వివిధ కాలనీల నందు వీధిలైట్లు లేక రాత్రి సమయంలో వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వీధిలైట్లు ఏర్పాటు చేయాలని గతంలో అనేకమార్లు పంచాయతీ కార్యదర్శిని కోరినప్పటికీ విద్యుత్ శాఖ అధికారులకు సిఫారసు చేసి చేతులు దులుపుకోవడం తప్ప పరిష్కారానికి చర్యలు తీసుకోలేదన్నారు. విద్యుత్ స్తంభాలు, వీధిలైట్లు ఏర్పాటు చేసే విషయంపై గ్రామపంచాయతీ కార్యదర్శిని కోరగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం సరి కాదన్నారు వీధిలైట్లు ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని లేనిపక్షంలో కాలనీ ప్రజలను సమీకరించి ధర్నా కార్యక్రమాలు చేపడతామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి సి. కృష్ణ, నల్ల చెలిమల శాఖ కార్యదర్శి బజారి, ప్రజాసంఘాల నాయకులు రాఘవేంద్ర, సుల్తాన్, భాష, కోమేష్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## లక్షల విలువ గల గుట్కాలు స్వాధీనం

**సిద్దిపేట, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
ప్రభుత్వం నిషేధించిన వివిధ రకాల గుట్కా ప్యాకెట్లు, విలువ 1,46,130 రూపాయలు పట్టుకున్న సిద్దిపేట టాస్క్ ఫోర్స్ మరియు సిద్దిపేట టూ టౌన్ పోలీసులు. ద్దిపేట పట్టణం టీ. మురళీకృష్ణ, హోల్ సేల్ కిరాణా షాప్ యజమాని తెరల సాయి కృష్ణ నివాసం సిద్దిపేట పట్టణం. అతను ప్రభుత్వం నిషేధించిన వివిధ రకాల గుట్కా ప్యాకెట్లు కాటన్ డబ్బాలతో హోల్ సేల్ గా అమ్ముతున్నాడని అమ్మదగిన సమాచారంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారులు సిబ్బంది సిద్దిపేట టూ టౌన్ పోలీసులు కలసి వెళ్లి షాపులో తనిఖీలు నిర్వహించగా ప్రభుత్వం నిషేధించిన వివిధ రకాల గుట్కా ప్యాకెట్లు కాటన్ బాక్సులలో ప్యాక్ చేసి ఉన్నవి మొత్తం గుట్కా ప్యాకెట్ల విలువ 1,46,130 గలవిపట్టుకున్నారు.సిద్దిపేట టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు, మాట్లాడుతూ. పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్ అక్రమ రవాణా చేసిన నిల్వ ఉంచిన, చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూదం, గ్యాంబ్లింగ్ చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై ప్రభుత్వం నిషేధించిన గుట్కాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.గ్రామాలలో, పట్టణాలలో ఇసుక, అక్రమ రవాణా చేసిన, పిడిఎస్ రైస్ అక్రమంగా దాచిపెట్టిన రవాణా గ్యాంబ్లింగ్, పేకాట, ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు కలిగి ఉన్నా రవాణా చేసిన మరిఏదైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

## అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

- నూతన ప్రభుత్వం కాంట్రాక్ట్- ఔట్సోర్సింగ్, వర్కర్లను తొలగించొద్దు
- కాంట్రాక్ట్- అవుట్సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి
- సిఐటియు కామనూరు శ్రీనివాస్ రెడ్డి

**బద్వేలు, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
బద్వేల్ పట్టణం నందు సిఐటియు విస్తృతస్థాయి సమావేశం పి.సి కొండయ్య అధ్యక్షతన శనివారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనురు శ్రీనివాలు రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో స్కీమ్ కార్మికుల తొలగింపులు అపాలని సిఐటియు జిల్లా కమిటీ కోరింది. గతంలో పరిష్కారం కాని సమస్యలను కొత్త ప్రభుత్వం పరిష్కరిస్తుందని అంగన్వాడీలు, ఆశా, మధ్యాహ్న భోజనం తదితర స్కీమ్ కార్మికులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వంలోకి వచ్చిన పార్టీ కింది స్థాయి నాయకులు స్థానికంగా పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లను పని మానేయాలని బెదిరిస్తున్నారని, తద్వారా వారి మనుషులను పెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలో ఒక అంగన్వాడీ వర్కర్ ఈ ఒత్తిడి తట్టుకోలేక ఆస్పత్రిలో చేరాల్సి వచ్చిందని వివరించారు. ఇదే జిల్లాలో మరో రెండు చోట్ల హెల్పర్లను బయటకు పంపి తమ వారిని పనిలో పెట్టుకోవాలని ఆదేశాలు ఇస్తున్నారని తెలిపారు. అనంతపురం జిల్లా వజ్రకరూరులో కూడా మధ్యాహ్న భోజన కార్మికురాలిపై స్థానిక అధికార పార్టీ నాయకులు దాడి చేశారని వివరించారు. ఆ ఒత్తిడి తట్టుకోలేక పురుగుమందు తాగి ఆమె చావుబతుకుల్లో ఉందని తెలిపారు. ఇతర కార్మికులపై కూడా ఒత్తిడి వస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పార్టీలు మారినప్పుడల్లా కొత్తగా ప్రభుత్వంలోకి వచ్చినవారు స్కీం వర్కర్లపై దాడి చేయడం ఒక రివాజుగా మారిందని విమర్శించారు. వర్కర్ల పని పరిస్థితులకు సంబంధించి కొన్ని విధి విధానాలున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న అధికార పార్టీ వారిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకోవాలని, అసంఘటితరంగా కార్మికులకు సమగ్ర చట్టం ఏర్పాటు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, పట్టణ నాయకులు ఆంజనేయులు, రాజగోపాల్, సుబ్బరాయుడు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రవీణ్ కుమార్,మురళి,సుధాకర్,పెంచలయ్య, మున్సిపల్ యూనియన్ నాయకులు హరి, ఆటో యూనియన్ నాయకులు ఓబులేసు, హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు ఓబయ్య, కార్పెంటర్స్ యూనియన్ నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యం

- సహకార సంఘాల అభివృద్ధి లో రైతులు భాగ స్వాములు కావాలి
- ఛైర్మన్ అధ్యక్షులు అలసకాని జనార్దన్
- చిలుకూరు లో ఘనంగా అంతర్జాతీయ సహకారదినోత్సవం

**సూర్యాపేట జిల్లా, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
రైతు సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యం అని చిలుకూరు పిఏసీఎస్ ఛైర్మన్ అలసకాని జనార్ధన్ అన్నారు. శనివారం చిలుకూరు పిఏసీఎస్ లో 102 వ అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా సహకార బ్యాంకులో జెండా ఎగుర వేసి మాట్లాడారు.ప్రతి ఏడాది జూలై మొదటి శనివారం ఈ దినోత్సవం జరుపుకుంటామని దీనికి ముఖ్య ఉద్దేశం సహకార రంగం పట్ల అవగాహన పెంచడం అన్నారు. సహకార ఉద్యమం ద్వారా అంతర్జాతీయ సంఘీభావం, ఆర్థిక సామర్థ్యం , సమానత్వం ప్రపంచ శాంతి కొరకు ప్రోత్సహించే దిశలో ఆలోచించడం అన్నారు. సహకార సంఘాలు ఏర్పడ్డాకనే రైతుల జీవితాలలో మార్పులు వచ్చాయని అన్నారు. ఒకప్పటి కంటే ఇప్పుడు సహకార సంఘం బ్యాంకులు అన్ని సదుపాయాలు రైతులకు కలిగిస్తున్నాయని అన్నారు. రైతులకు, డైరెక్టర్ లకు సహకార దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి చిలువేరు లక్ష్మీనారాయణ ,డైరెక్టర్స్ కొండా సోమయ్య, కస్తూరి సైదులు, కోడారు రాంబాబు, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మ పేరిట మొక్కలను నాటిన బిజెపి నాయకులు

**మంథని ప్రతినిధి, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
భారతీయ జనతా పార్టీ మంథని పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంథని పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో ఏక్ పెడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా బిజెపి నాయకులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించాలన్న, పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తట్టుకోవాలన్న మనం పిలుస్తున్న గాలిలో ఆక్సిజన్ శాతాన్ని పెంచాలన్న సకాలంలో వర్షాలు కురియాలన్నా చెట్లే మనకు ఆధారమని అవి లేకుంటే మనిషి మనుగడే లేదని అన్నారు. ప్రతి ఒక్కరూ అమ్మ పేరిట ఒక మొక్కను నాటాలనే సదుద్దేశంతో భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. భారతీయ జనతా పార్టీ మంథని పట్టణ అధ్యక్షుడు సబ్బాని సంతోష్, పట్టణ కన్వీనర్ సామల అశోక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ నాంపల్లి రమేష్, సీనియర్ నాయకులు కొండపాక సత్య ప్రకాష్, బోగోజు శ్రీనివాస్, చిలువేరి సతీష్, బొల్లంపల్లి లక్ష్మణ్, దాసరి శ్రవణ్, ఎడ్ల సాగర్, దూడపాక రోజా, గుర్రాల రాజు తదితరులు పాల్గొన్నారు.

## పుణ్యక్షేత్రాలుసందర్శించిన ఎమ్మెల్యేబొలిశెట్టి శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ శనివారం సందర్శించారు. ఆలయాల్లో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురవాయిగూడెంలోని మద్ది ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఆయన తనయులు బొలిశెట్టి రాజేష్ దంపతులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ద్వారకాతిరుమల చిన్న వెంకన్న సన్నిధిలో బొలిశెట్టి శ్రీనివాస్ కు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంతో ప్రశాంతంగా ఉండే పశ్చిమగోదావరి జిల్లా లో ప్రతిష్టాత్మకమైన ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామిని, మద్ది ఆంజనేయ స్వామి వారిని కుటుంబ సభ్యులతో కలిసి పూజల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని ప్రజలంతా సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.

## పార్థీ గ్యాంగ్ ఆటకట్టించిన పోలీసులు

**హైదరాబాద్, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
రదుగట్టిన పార్థీ గ్యాంగ్.. వీళ్ల పని దొంగతనాలు, దోపిడిలు, హత్యలు.. టార్గెట్ చేశారంటే ఇక దోపిడి జరగాల్సిందే.. ఈ కరుడుగట్టిన పార్థీ గ్యాంగ్ హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై దోపిడీ, దొంగతనాలకు పాల్పడుతుండటం కలకలం రేపింది.. ఈ క్రమంలోనే నల్లగొండ పోలీసులు ఆ గ్యాంగ్ పై కన్నేసి.. ఇద్దరిని అరస్ట్ చేసింది.. సినిమా ఫక్కిలో దోపిడీ దొంగతనాలకు పాల్పడుతున్న పార్థీ గ్యాంగ్ లో ఇద్దరూ కీలక సభ్యులను నల్లగొండ పోలీసులు తాజాగా.. అరెస్టు చేశారు. కరుడుగట్టిన నేరస్థులుగా ఉన్న వీరు 32 కేసుల్లో నిందితులుగా ఉన్నారు. రెండు మూడు నెలలుగా హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిని టార్గెట్ గా చేసుకుని పార్థీ గ్యాంగ్ దోపిడీలు, దొంగతనాలకు పాల్పడుతోందని పోలీసులు తెలిపారు. హైవే వెంట పార్క్ చేసిన వాహనాల్లోంచి డీజిల్ దొంగతనాలు మొదలు.. రహదారిపై వెళ్తున్న వాహనాలను ఆపి దారి దోపిడీలకు దుండగులు పాల్పడుతున్నారు.ఈ గ్యాంగ్ దోపిడి దొంగతనాలే కాదు.. హత్యలకు కూడా వెనకాడదు.. గత కొంత కాలం నుంచి కంటిమీద కునుకులేకుండా చేస్తున్న పార్థీగ్యాంగ్ ను అరెస్ట్ చేసేందుకు నల్లగొండ జిల్లా ఎస్పీ మూడు టీం లను రంగంలోకి దించారు.. ఈ క్రమంలోనే.. శుక్రవారం చౌటుప్పల్ మండలం దేవులమ్మ నాగారం, కొయ్యలగూడెంలలో దొంగతనాలకు పాల్పడిన పార్థీ గ్యాంగ్ అక్కడి నుంచి టాటాఏస్ వాహనంలో హైదరాబాద్ కు పారిపోతున్నారు. అప్పటికే గ్యాంగ్ పై నిఘా పెట్టిన నల్లగొండ స్పెషల్ పార్టీ పోలీసులు నార్కెట్‌పల్లి నుంచి వెంబడించారు.ఓఆర్ఆర్ అంబర్పేట్ వద్ద పోలీసులు పార్థీ గ్యాంగ్ ను పట్టుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పార్థి గ్యాంగ్ సభ్యులు కత్తులతో పోలీసులపై దాడికి యత్నించారు. దీంతో పోలీసులు గాలిలో కాల్పులు జరిపి గ్యాంగ్ లో కీలకమైన ఇద్దరిని టాటా వాహనంలో పట్టుకున్నామని, మరో ఇద్దరు పరారీలో ఉన్నారని నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ చెప్పారు.ఈ ఇద్దరూ మహారాష్ట్రకు చెందిన అప్ప పాండ్రంగా, శుభం అశోక్ లుగా గుర్తించారు. వీరు క్రూరమైన కరుడుగట్టిన నేరస్తులని తెలిపారు. ఈ ముఠా నల్గొండ, సంగారెడ్డి జిల్లాతో పాటు సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో పలు దోపిడి దొంగతనాలకు పాల్పడిందని ఎస్పీ తెలిపారు.హత్యలతోపాటు 32 నేరాల్లో ఈ గ్యాంగ్ నిందితులుగా ఉన్నారని జిల్లా ఎస్పీ చెబుతున్నారు. హైవేలను టార్గెట్ గా చేసుకొని పార్క్ చేసిన వాహనాల్లో నిద్రిస్తున్న వారిపై దాడి చేసి నగదు బంగారు ఆభరణాలను దోపిడీ చేస్తారని ఆయన తెలిపారు. ప్రతిఘటిస్తే ప్రాణాలు తీయడానికి కూడా వెనకారని, ఇలాంటి ముఠాల పట్ల అప్రమత్తంగా ఉండడంతో పాటు పోలీసులకు సమాచారం ఇవ్వాలని శరత్ చంద్ర పవర్ కోరారు.

## ఆటో, లారీ ఢీ...ముగ్గురు మృతి


**నిర్మల్ జిల్లా, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
రాష్ట్ర సరిహద్దులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బాసర నుండి మహారాష్ట్రలోని ధర్మబాద్ వెళ్తున్న ఆటోను లారీ ఢీకొంది.ఘటనలో ఆటోలో వెళ్తున్న ముగ్గురు మృతి, పలువురికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను ధర్మ బాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం వుంది

## కొడాలి నానిపై కేసు

**విజయవాడ, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత కొడాలి నానికి మరోసారి షాక్ తగిలింది. 'తన తల్లి చావుకు వారే కారణం' గుడివాడ ఆటోనగర్‌కు చెందిన దుగ్గిరాల ప్రభాకర్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నానితో పాటు కృష్ణా జిల్లా గత జేసీ ప్రస్తుత తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మాధవి లతారెడ్డి, ఏపీ బేవరేజెస్ మాజీ ఎండీ వాసు దేవరెడ్డిపై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిపై 448, 427, 506 ఆర్‌అండ్‌డబ్ల్యూ 34 ఐపీసీ సెక్షన్ల కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఎన్నికల ఫలితాల అనంతరం కొడాలి నానిపై ఒకట్రెండు కేసులు నమోదయ్యాయి.'గుడివాడ ఆటోనగర్ నాలుగో రోడ్డులోని పాత లిక్కర్ గోడౌన్‌కు 2011లో మా అమ్మ ఓనర్‌గా ఉండేవారు. ఆ సమయంలో టెండర్ల ద్వారా తక్కువ ధరకే లిక్కర్ గోడౌన్ పొందాం. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక.. పద్మారెడ్డి అనే వ్యక్తి ఆయన అల్లుడు రామ్‌గోపాల్‌రెడ్డి, అప్పటి జేసీ మాధవీ లతారెడ్డి, బేవరేజెస్ కార్పొరేషన్ అప్పటి ఎండీ వాసుదేవరెడ్డి సహకారంతో మా గోడౌన్‌ను బలవంతంగా ఖాళీ చేయించారు. పద్మారెడ్డికి లబ్ధి చేకూర్చడం కోసం కొడాలి నాని ప్రమేయంతో మమ్మల్ని బెదిరించారు. తమ గోదాంలోని లిక్కర్ కేసులను పగలగొట్టి తగలబెట్టారు. మా బాధ చెప్తే వాసుదేవరెడ్డి, మాధవీ లతారెడ్డి దూషించారు. ఇది జరిగిన కొద్ది రోజులకే నా తల్లి మనస్తాపంతో కన్నుమూశారు. కొడాలి నాని, ఆయన అనుచరులు, అప్పటి అధికారులు అందరిపైనా గుడివాడ – 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. అయితే, నాపై బెదిరింపులకు పాల్పడుతున్నారు.' అని ఫిర్యాదుదారు ప్రభాకర్ మీడియాకు తెలిపారు.

## 9, 16 బ్రేక్ దర్శనాలు రద్దు...

**తిరుమల, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
: శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం కీలక అప్డేట్ ఇచ్చింది. శ్రీవారి ఆలయంలో జూలై 16న సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో జూలై 9వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఉంటుందని ప్రకటించింది. దీంతో జూలై 9 , 16వ తేదీల్లో తిరుమలలో బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు టీటీడీ వెల్లడించింది.తాజా నిర్ణయం కారణంగా జూలై 8, 15వ తేదీల్లో ఎలాంటి సిఫారసు లేఖలు స్వీకరించబడవని టీటీడీ స్పష్టం చేసింది. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని ఓ ప్రకటనలో కోరింది.సాధారణంగా సంవత్సరంలో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని నిర్వహిస్తుంటారు. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే తిరుమంజనం కార్యక్రమం సుమారు 5 గంటలపాటు కొనసాగుతుందని టీటీడీ తెలిపింది. తిరుమంజనం కార్యక్రమం అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు ఆలయ అర్చకులు ఆగమోక్తంగా పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు.అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు. తిరుమంజనం కారణంగా మంగళవారంనాడు నిర్వహించే అష్టదళపాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది.తిరుపతిలోని శ్రీ కోదండరామాలయంలో జులై నెలలో పలు విశేష ఉత్సవాలు జరుగనున్నాయి. జులై 13, 20, 27వ తేదీల్లో శనివారం సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీసీతారామ లక్ష్మణుల మూలవర్ల అభిషేకం, సాయంత్రం 5 గంటలకు ఊంజల్‌సేవ నిర్వహిస్తారు.జులై 16న ఆణివార ఆస్థానం ఉంటుంది. జులై 30 నుండి ఆగస్టు 2వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరుగుతాయని తిరుమల తిరుపతి దేవస్థానం తెలిపింది.శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో జూలై 10 నుండి 12వ తేదీ వరకు సాక్షాత్కార వైభవోత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది.ఈ సందర్భంగా తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాల సేవ, కొలువు, పంచాంగశ్రవణం నిర్వహించారు. ఉదయం 6.30 నుండి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు.ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. మధ్యాహ్నం 12.30 గంటల నుండి భక్తులను దర్శనానికి అనుమతించారు.సాక్షాత్కార వైభవోత్సవాల్లో భాగంగా మూడు రోజులపాటు ఉదయం 10 నుండి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు.



తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# ఎమ్మెల్యే తాలూకా నెంబర్లు ప్లేట్లు మార్పు

**కాకినాడ, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
"పిఠాపురం ఎమ్మెల్యే తాలూకా"– ఏపీలో హాట్ టాపిక్ గా మారింది. పిఠాపురం నుంచి పోటీ చేసిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ భారీ మెజార్టీతో గెలిచి డిప్యూటీ సీఎం అయ్యారు. దీంతో అప్పటి నుంచి జనసేన మద్దతుదారులు తమ వాహనాలకు పిఠాపురం ఎమ్మెల్యే తాలూకా అని నెంబర్ ప్లేట్లు పెడుతున్నారు. ఏపీలో ఎమ్మెల్యే, ఎంపీ తాలూకా ట్రెండ్ నడుస్తోంది. టీడీపీ, జనసేన మద్దతుదారులు వారి నియోజకవర్గ ఎమ్మెల్యే, ఎంపీల పేర్లతో ఫలానా తాలూకా వాహనాలపై నెంబర్ ప్లేట్లు పెట్టుకుంటున్నారు. అయితే ఇన్నాళ్లు వీటిని చూసి చూడనట్లు వదిలేసిన పోలీసులు..ఇక యాక్షన్ లోకి దిగారు. ఇటీవల పిఠాపురం వారాహి సభలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు ఇందుకు ఒక కారణం కావొచ్చని నెటిజన్లు అంటున్నారు.ఇటీవల పిఠాపురం సభలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... వాహన నెంబర్ ప్లేట్ పై పిఠాపురం ఎమ్మెల్యే తాలూకా అని వేసుకోవద్దని సూచించారు. నాలుగురికి ఆదర్శంగా ఉండాల్సిన జనసైనికులు...చట్టాన్ని పాటించాలని కోరారు. నెంబర్ ప్లేట్ పై పిఠాపురం ఎమ్మెల్యే తాలూకా అని రాసుకుంటే పోలీసులు తనను తిడతారని, అందుకే మోటారు వాహన చట్టం నిబంధలన మేరకు వాహన నెంబర్ కనిపించేలా ప్లేట్స్ ఉండాలన్నారు. దీంతో ఇన్నాళ్లు నెంబర్ ప్లేట్లపై ఫలానా తాలూకా అని ఉన్నా పెద్దగా పట్టించుకోని పోలీసులు, ఇకపై అలా చూస్తూ ఊరుకోం అంటున్నారు. ఇటీవల వాహన తనిఖీల్లో పిఠాపురం ఎమ్మెల్యే తాలూకా అని రాసి ఉన్న వాహనాన్ని ఆపిన ట్రాఫిక్ పోలీసులు...నెంబర్ ప్లేట్ మార్పించారు. దీనిపై జనసైనికులు సామాజిక మాధ్యమాల్లో స్పందిస్తున్నారు. నెంబర్లు ప్లేట్లు మార్చుకోవాలని, వాహనంపై మరెక్కడైనా ఫలానా తాలూకా అని వేసుకోవాలని సూచిస్తున్నారు.పోలీసులు నెంబర్ ప్లేట్లు మార్పిస్తున్న వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. దీంతో వైసీపీ మద్దతుదారులు జనసైనికులపై సెటైర్లు వేస్తున్నారు. వైసీపీకి కౌంటర్ ఇస్తున్న జనసైనికులు...తాము చట్టాన్ని పాటిస్తామని అందుకే పోలీసులు చెప్పిన వెంటనే నెంబర్ ప్లేట్లు మారుస్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నేరుగా పోలీసులతో జగన్ ఫొటోలు ఆటోలకు అతికించిన విషయం మర్చిపోయారా? అంటూ సెటైర్లు వేస్తున్నారు. ఆ వీడియోలు పోస్టు చేస్తూ కౌంటర్లు ఇస్తున్నారు.ఇక పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన సొంతింటి కోసం స్థలం కొన్నారు. భోగాపురం ఇల్లింద్రాడ పరిధిలో 3.52 ఎకరాలు పవన్ కొలుగోలు చేసినట్లు తెలుస్తోంది. దీంతో పిఠాపురంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. గతంలో రూ.15–రూ.16 లక్షలు పలికిన ఎకరం భూమి ఇప్పుడు రూ.కోటి ధర పలుకుతుందని ప్రచారం జరుగుతోంది. ఎన్.హెచ్ 216 సమీపంలో అయితే ఎకరం రూ.2–3 కోట్ల వరకు రేటు పలుకుందని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో భూములు కొనేందుకు రియాల్టర్లు రైతుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారని సమాచారం. తమ భూముల ధరలు అమాంతం పెరగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## యాసిడ్ ట్యాంకర్ ఢీ... ముగ్గురు మృతి

**కడప, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
ఆంధ్రప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.. ఈ ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందారు.. ఈ ఘటన అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలోని రామాపురం మండలం కొండవాండ్లపల్లి సమీపంలో తెల్లవారుజామున జరిగింది. యాసిడ్ తీసుకుని వెళుతున్న వాహనం ఢీకొని కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు.. మరొకరు ఆసుపత్రికి తీసువెళుకున్న క్రమంలో.. మార్గమధ్యలో మృతి చెందాడు.. మరొకరికి తీవ్రగాయాలు కాగా.. అతన్ని రాయతోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలోని రామాపురం వద్ద యాసిడ్ తో ట్యాంకర్ లారీ.. కారు ఢీకొన్నాయి.. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు మృత్యువాత పడ్డారు. మృతులు రాయచోటి సమీపంలోని ఓ గ్రామంలో జరిగే శుభకార్యానికి వెళుతుండగా శనివారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగింది.వీరంతా కడప నగరానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. అందులో ఒకరు హోంగార్డు కూడా ఉన్నారు.. ఒకరికి తీవ్ర గాయాలు కాగా.. రాయచోటి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.లారీని ఓవర్ టెక్ చేసే క్రమంలో కారు లారీ వెనక భాగంలో ఢీకొట్టింది.. వెంటనే స్థానికులు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టి.. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.శుభకార్యానికి బయలుదేరి వెళుతున్న క్రమంలో.. కుటుంబసభ్యులు ఇలా మృత్యువాత పడటంతో బంధువులు శోకసంద్రంలో మునిగారు.. ఇలా జరుగుతుందని అస్సలు ఊహించలేదంటూ రోదిస్తున్నారు.అన్నమయ్య జిల్లా రామాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.కాగా___ కడప నుంచి రాయచోటికి వెళ్లే మార్గం సింగిల్ రోడ్ లైన్ కావడంతో ఓవర్ టెక్ చేసే సమయంలో ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు అంటున్నారు.

## డిగ్రీ పూర్తి కాకపోవడం వల్లనే మంత్రిని కాలేదు

**విజయనగరం, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
2024లో సార్వత్రిక ఎన్నికల్లో సుజయ కృష్ణ రంగారావు సోదరుడు ఆర్ వి ఎస్ కె కె రంగారావు అలియాస్ బేబీనాయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈయన పార్టీలో అత్యంత క్రియాశీలంగా వ్యవహరించారు. బొబ్బిలితో పాటు పక్క నియోజకవర్గాల్లో సైతం వీరి ప్రాబల్యం ఉంటుంది. ప్రస్తుత ఎన్నికల్లో ఇటు బేబీ నాయన, అటు ఆయన సోదరుడు మాజీ మంత్రి సుజయ కృష్ణ రంగారావు పార్టీ గెలుపు కోసం చాలా కష్టపడ్డారు. ఈ నేపథ్యంలోనే క్యాబినెట్ లో తనకు మంత్రి పదవి దక్కుతుందని ఆశించారు. ఆయన అనుచరులు కూడా మంత్రి పదవి వస్తుందని ధీమాగా ఉన్నారు. కానీ ఆఖరి నిమిషంలో బేబీనాయనకు మంత్రి పదవి దక్కలేదు. అయినా పార్టీ నిర్ణయం మేరకు మౌనం వహించారు. తమ అభిమానులకు సైతం ఎక్కడా పార్టీ పై తప్పుగా మాట్లాడొద్దని సూచించారు.ఈ క్రమంలోనే స్థానిక ఎమ్మెల్యేగా బొబ్బిలి మండలం కోమటిపల్లి బిసి గురుకుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో బేబీ నాయన పాల్గొన్నారు. అక్కడ విద్యార్థులకు మోటివేట్ చేసే విధానంలో భాగంగా తన మనసులోని భావోద్వేగాన్ని బయటపెట్టి అందరినీ ఆశ్చర్యపరిచారు. తాను బొబ్బిలి రాకముందు చెన్నైలో ఉండేవాడినని, తనకు రాజకీయాలపై ఉన్న ఆసక్తితో బొబ్బిలి వెళ్తానని తన అమ్మతో చెప్పానని అన్నారు. అప్పుడు అమ్మ నువ్వు బొబ్బిలి వెళ్ళొద్దని, బొబ్బిలి వెళితే నీకు చదువుకోవడం కుదరదని, కాబట్టి బొబ్బిలికి పంపనని అమ్మ చాలా గట్టిగా చెప్పింది. అయితే తాను మాత్రం బొబ్బిలిలో బాగా చదువుకొని డిగ్రీ కూడా పూర్తిచేస్తానని అమ్మకి మాట ఇచ్చానని అన్నారు. అలా తాను అమ్మకి మాట ఇవ్వడంతో అమ్మ తనను బొబ్బిలికి పంపించారని తెలిపారు.అలా బొబ్బిలికి వచ్చిన తరువాత నేను చిన్న వయస్సులోనే రాజకీయాల్లో పడిపోయి అమ్మకి ఇచ్చిన మాట పక్కనపెట్టి డిగ్రీ కూడా పూర్తి చేయలేకపోయానని చెప్పారు. కొండపల్లి శ్రీనివాస్ విదేశాల్లో చదువుకున్నాడు.. కాబట్టి మంత్రి పదవి దక్కిందని, తాను కూడా అమ్మకి ఇచ్చిన మాట తప్పకుండా డిగ్రీ పూర్తి చేసి ఉంటే బాగుండేదని, ఇప్పుడు మంత్రిని అయ్యి ఉండేవాడినని తన మనసులోని ఆవేదనను విద్యార్థుల ఎదుట వ్యక్తపరిచారు.కావున మంచి మంచి అవకాశాలు రావాలంటే పిల్లలు బాగా చదువుకోవాలని.. అప్పుడే మంచి అవకాశాలు వస్తాయని తన జీవితాన్ని ఒక పాఠంగా విద్యార్థులకు తెలియజేశారు బేబీ నాయన. మంత్రి పదవి దక్కకపోవడం.. దీనిపై ఎలా స్పందిస్తారోనని పార్టీలో చర్చ జరుగుతున్న క్రమంలో బేబినాయన తన మనసులోని మాటను బయటపెట్టడంతో.. అది విన్న కొందరు అభిమానులు భావోద్వేగానికి గురయ్యారు. ఇదే విషయ ఇప్పుడు బొబ్బిలి ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.

## ఫోన్ ట్యాపింగ్ లో ఎమ్మెల్యే సంజయ్ ప్రమేయం

**జగిత్యాల, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
జగిత్యాల జిల్లా కేంద్రంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా బోగ శ్రవణి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా డా. బోగ శ్రావణి మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ లో ప్రధాన సూత్రదారి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అని అసెంబ్లీ ఎన్నికల సమయంలో నా ఫోన్ ట్యాప్ చేశారని శ్రావణి ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ నుండి తప్పుకోవడానికి సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీ లో చేరాడని ఫోన్ ట్యాపింగ్ లొ ప్రధాన పాత్ర ఎమ్మెల్యే సంజయ్ దేనని ఆరోపించారు ఫోన్ ట్యాపింగ్ కేసు లో సంజయ్ ని విచారించాలని, రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు సిబిఐ కి అప్పగించాలని ఆమె డిమాండ్ చేసారు.

# తిరుపతిని అన్ని విధాలా అభిఅభివృద్ధి చేద్దాం

## ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**తిరుపతి, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
తిరుపతి నగరాన్ని అన్ని విధాల అభివృద్ధి చేద్దామని, మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బందికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం నగరపాలక సంస్థ అన్ని విభాగాల అధిపతులతో, అధికారులతో కమిషనర్ అదితిసింగ్ ఐఏఎస్ ఆధ్వర్యంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సమావేశం అయినారు. మొదటిసారిగా నగరపాలక సంస్థకు విచ్చేసిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు అధికారులు బొకేలు అందించి స్వాగతం పలికారు. అధికారుల పరిచయం అనంతరం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తిరుపతి అభివృద్ధికి అందరం కలిసి పనిచేసి రాష్ట్రంలోనే ఓక ప్రత్యేక స్థానానికి తీసుకువద్దామన్నారు. తిరుపతి నగరంలో ముఖ్యంగా శానిటేషన్, మంచినీరు, రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇద్దామన్నారు. చాలా కాలువల్లో వ్యర్థాలు, ప్లాస్టిక్ బాటిల్స్, ధర్మాకోల్ వ్యర్థాలతో నిండిపోయి మురికినీరు సాఫీగా వెల్లడం లేదనే విషయాన్ని ఎమ్మెల్యే ప్రస్థావిస్తూ స్పెషల్ డ్రైవ్ చేపట్టి కాలువలు శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లను ఇకపై నిర్మించేటప్పుడు అవి ప్రజలకి ఉపయోగపడేలా వుండాయా అని అన్ని విధాలా పరిశీలించాలని, నిర్మించదలిస్తే వాటి మన్నికపై అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతుబజార్, మార్కెట్లు, ఫిష్ మార్కెట్లను ఆధునికరిస్తే భాగుంటాయని, వీటిల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఫిష్ మార్కెట్ వద్ద వ్యర్థాల వాసనతో ప్రజలు ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులపై




ప్యాచ్ వర్కులను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. పుడ్ కోర్టులను నిర్ణీత స్థలాల్లో ఏర్పాటు చేసేందుకు పరిశీలించాలన్నారు. స్లమ్ ఏరియాల్లోని ప్రజల ఇబ్బందులను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తిరుపతి అభివృద్ధికి అందరం కలిసికట్టుగా సమన్వయంతో పని చేద్దామని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామి రెడ్డి, హెల్త్ ఆపిసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫిసర్లు సేతుమాధవ్, కె.ఎల్.వర్మ, మేనేజర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబు పై అసత్య ఆరోపణలు చేసే ప్రజలు ఊరుకోరు

### మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైనాల రాజు




**కమాన్ పూర్, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబును విమర్శిస్తే ప్రజలు ఊరుకోరని దల కాంగ్రెస్ అధ్యక్షుడు వైనాల రాజు, ప్యాక్స్ ఛైర్మెన్ ఇనగంటి భాస్కర్ రావు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజి ఎంపీపీ మల్యాల రాంచందర్ గౌడ్ హెచ్చరించారు.ఈ మేరకు శనివారం కమాన్ పూర్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ...మంత్రి శ్రీధర్ బాబు ని విమర్శించే హక్కు పుట్ట మధుకు లేదనిమంత్రి శ్రీధర్ బాబు పై అసత్యపు ఆరోపణలు చేస్తే రుకునేది లేదు అని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబును విమర్శించే హక్కు మాజీ జడ్పి చైర్మన్ పుట్ట మధుకు లేదని కాంగ్రెస్ నాయకులు అన్నారు.ఇటీవల కూలిన ఓడేడు బిడ్జీ గార్డెర్లు పై పుట్ట మధు చేసిన వ్యాఖ్యలపై వారు ఘాటుగా స్పందించారు. మంత్రి శ్రీధర్ బాబుపై అసత్యపు ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కట్టిన బ్రిడ్జిని మళ్లీ మంత్రి శ్రీధర్ బాబు పై రుద్దడం సాధికాదని వారన్నారు. ఇటువంటి చౌకబారు ప్రకటనలు చేస్తే సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైనాల సింగిల్ విండో అధ్యక్షులు ఇనగంటి భాస్కర్ రావు మాజీ మండల పరిషత్ అధ్యక్షులు మల్యాల రామచంద్రన్ గౌడ్ మండల కాంగ్రెస్ అధికార ప్రతినిధి చొప్పరి శేఖర్ మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు భాద్రపు శంకర్ మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిగురు మొండయ్య మండల కాంగ్రెస్ కార్యదర్శి కుశన రవి మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి అఫ్సర్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కుక్క రవి కమాన్ పూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు కొంతం శ్రీనివాస్ జూలపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు భూస తిరుపతి రొంపుకుంట గ్రామ శాఖ అధ్యక్షుడు కోల నరేందర్ పెంచికల్పేట్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఇరువురాల శేఖర్ గుండారం గ్రామ శాఖ అధ్యక్షుడు పిడుగు శంకర్ సిద్దిపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు గద్దం శీను నాగారం గ్రామ శాఖ అధ్యక్షుడు యాదగిరి రాజయ్యమాజీ సర్పంచ్ కటకం రవీందర్ తొగరి అశోక్ పిడుగు నరసయ్య కమ్మ గోని మల్లయ్య ఆడవాళ్ళ చంద్రయ్య బీసీ సెల్ జిల్లా సెక్రెటరీ బుర్ర సత్యం సింగిల్ విండో డైరెక్టర్ గుండెటి శ్రీ మూర్తి మారైన ముత్యాలు యాదవ్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొజ్జ సతీష్ మాతంగి సదానందం కోలా తిరుపతి గౌడ్ కటికి రెడ్డి తిరుపతి చిక్కుల శ్రీనివాస్ దాసరి శంకర్ అభ్యంగుల కొమురయ్య దాసరి శంకర్ దాసరి రాజేష్ కామెరా నరేష్ చొప్పరి శ్రీనివాస్ గీసా రవి మార్కాపరసరం బొంగోని వీరన్న బంగారి వెల్డింగ్ రవి తాటికొండ శేఖర్ కలువల ప్రకాష్ మరియు పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


## దాసరి ఉష, హన్మయ్యపై ఎస్సీ ఎస్టీ కేసు పెట్టాలి

**పెద్దపల్లి ప్రతినిధి, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**



ఎన్నికల సమయంలో ప్రచార రథం ఢీకొని చావుబతుకుల్లో కొట్టు మిట్టాడుతున్న బాధితురాలికి న్యాయం చేయాలని, ఆమె దుస్థితికి కారణమైన దాసరి ఉష, ఆమె తండ్రి హ్యన్మయ్యపై ఎస్సీ ఎస్టీ కేసు పెట్టాలని మహనీయుల ఆశయ సాధన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి కైలాసం డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2023 అక్టోబర్ 20న పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట గ్రామంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బీఎస్పీ అభ్యర్థి దాసరి ఉష ప్రచార రథం ఢీకొని గ్రామానికి చెందిన జిల్లాల అంజమ్మ తీవ్రంగా గాయపడి అచేతన స్థితిలో ఉందన్నారు. అప్పట్లో బాధితురాలికి పూర్తి వైద్య ఖర్చులు, కోలుకునే వరకు తామే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చిన ఉష, హమ్మయ్య అప్పుడు వైద్యం చేయించారని తెలిపారు. వైద్యం పూర్తి స్థాయిలో అందక తిరిగి బాధితురాలికి ఆపరేషన్ అవసరం ఏర్పడిందని, ఈవిషయంపై తాము మర్యాదపూర్వకంగా అడిగితే హేళన చేశారని వాపోయారు. దళితులమనే భావనతో చులకనగా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం సుద్దులు చెప్పే ఉష బాధిత మహిళ పట్ల ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. దగా పడ్డ మహిళకు అధికారులు న్యాయం చేయాలని, ప్రచార రథాన్ని వాడిన దాసరి ఉష బాధితురాలికి వైద్యం పూర్తి స్థాయిలో చేయించాలని డిమాండ్ చేశారు. స్పందించకుంటే బాధిత మహిళ పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో కండె కరుణాకర్, ఈదునూరి చంద్రయ్య, ఆనంద్, దేవయ్య, నందయ్య, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

## మల్లాపూర్ మండలంలో గుడుంబా బట్టిల ధ్వంసం ఎక్సైజ్, పోలీస్ సంయుక్త దాడులు



తెలంగాణ రాష్ట్రాన్ని గుడుంబా రహిత రాష్ట్రంగా మార్చాలని ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో మల్లాపూర్ మండలం లోని వేంపల్లి వెంకటరావుపేట గ్రామంలో గుడుంబా దాడులు జరిగాయి. ఈ దాడులలో 250 లీటర్ల బెల్లం పాకం స్వాదీనం చేసుకొని, ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మెట్ పల్లి ఎక్సైజ్ సీఐ వినోద్ రాథోడ్ తెలిపారు. గుడుంబా తయారు చేసే సామాగ్రి తో పాటు 6 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. సిఐ వినోద్ రాథోడ్ మాట్లాడుతూ, గుడుంబా వల్ల కొన్ని కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా నాశనమవుతున్నాయని, ఇట్టి గుడుంబా తయారిదారులకు గతంలో ప్రభుత్వం గుడుంబా తయారిని వదలాలని, వారికి స్వయం ఉపాధికై ఆర్థిక సహాయాన్ని అందించిందని గుర్తుచేశారు. అయినా గుడుంబా తయారు చేస్తున్నారని అన్నారు. ఈ రోజుల్లో నూతన చట్టాలు వచ్చాయని, తప్పు చేసేవారిపై చట్టాలు అమలు జరుగుతాయని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో గుడుంబా తయారీదారులను, అమ్మకం దారులను, సరఫరాదారులను కట్టడి చేస్తామని, వీరిపై బైండోవర్ కేసు నమోదు చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ దాడులలో ఎక్సైజ్ సీఐ వినోద్ రాథోడ్, మల్లాపూర్ పోలీస్ ఎస్ఐ కిరణ్, పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు

# దొంగగా మారిన స్వచ్ఛంధ్రా కార్పొరేషన్ మాజీ డైరక్టర్

**విశాఖపట్టణం, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ఓ వైసీపీ లీడర్. స్వచ్ఛంద్రప్రదేశ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్‌గా పనిచేసి ఓ గొప్ప పొజిషన్‌లో ఉన్నా..చేతివాటం ప్రదర్శించడం ఆపలేదు. ఓ బైక్ దొంగతనం చేసి దాన్ని విక్రయిస్తూ అడ్డంగా దొరికిపోయాడు.అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లికి చెందిన ఓ వైసీపీ నాయకుడు దొంగతనం చేస్తూ కటకటాలపాలైన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యింది. చింతపల్లి మండలానికి చెందిన షేక్‌మీరా పదేళ్ల క్రితం ఐటీడీఏ కాఫీ ప్రాజెక్ట్‌లో పని చేసేవాడు. అక్కడ అవినీతికి పాల్పడి 2 లక్షల రూపాయల వరకు దోచుకోవడంతో అతన్ని పనిలో నుంచి తీసేశారు. అప్పటి నుంచి షేక్‌మీరా వైసీపీలో క్రియాశీలకంగా తిరుగుతున్నాడు. దీంతో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మీ ఆయన్ను స్వచ్ఛంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి సిఫార్సు చేశారు. ఆమె సిఫార్సు మేరకు షేక్‌మీరాను డైరెక్టర్ పదవిలో నియమించారు. మూడేళ్లపాటు ఆ పదవిలోనే కొనసాగాడు. మండలస్థాయిలో ఓ మంచి పొజిషన్‌లో ఉన్నాడు. నాయకుడుగా ఎదిగేందుకు అప్పటి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మీ ఎంతో ప్రోత్సహించారు. కానీ షేక్‌మీరా తన పాత బుద్ధిని వీడలేదు. ఓ బైక్‌ను దొంగతనం చేసి విక్రయిస్తూ పోలీసులకు పట్టుబట్టాడు. జీకే వీధి మండలంలో ఉపాధిహామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పిండిరాము...చింతపల్లిలో అద్దెకు ఉంటున్నాడు. ఆ ఇంటి ముందు తన బైక్‌ను పార్కు చేసి వెళ్లగా...షేక్ మీరా చాకచక్యంగా ఆ బైక్‌ను ఈనెల ఒకటో తేదిన దొంగలించాడు. దీంతో బాధితుడు చింతపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దొంగిలించిన వాహనాన్ని మీరా విశాఖపట్నం తీసుకెళ్లి విక్రయిస్తుండగా అక్కడి పోలీసులు పట్టుకున్నారు. వాహనంతోపాటు నిందితుడుని చింతపల్లి పోలీసులకు అప్పగించారు. షేక్‌మీరాను అరెస్ట్ చేసిన పోలీసుల ఆ తర్వాత స్టేషన్ బెయిల్ ఇచ్చి విడుదల చేశారు.

## టాలీవుడ్ ప్రొడ్యూసర్ ఆత్మహత్య

**హైదరాబాద్, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
: టాలీవుడ్‌లో విషాదం చోటుచేసుంది. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ స్వప్న వర్మఆత్మహత్య చేసుకున్నారు. రెండు రోజులు క్రితం బలవన్మరణానికి పాల్పడిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసుంది. మాదాపూర్‌లో స్వప్న ఒంటరిగా నివాసం ఉటుంది. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందుల వల్ల స్వప్న ఆత్మహత్య చేసుకుని ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. వివరాలు.. స్వప్న వర్మ సొంతూరు ఆంధ్రప్రదేశ్ రాజమండ్రి. సినీరంగంలో పనిచేసేందుకు ఆమె మూడు సంవత్సరాల క్రితం హైదరాబాద్‌కు వచ్చారు. ఈ క్రమంలో ఇండస్ట్రీలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా పనిచేస్తున్న ఆమె గత సంవత్సరం నుంచి మాదాపూర్‌లోని కావూరి హిల్స్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటున్నారుఅక్కడ తీగల హౌస్ అపార్ట్‌మెంట్ 101 ఫ్లాట్‌లో ఆమె నివసిస్తున్నరు. అయితే, గత ఆరు నెలలుగా ఎలాంటి ప్రాజెక్టు రావడ లేదు. దీంతో పనిలేకపోవడంతో స్వప్న ఒత్తిడికి గురైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రెండు రోజు క్రితం తాను నివసిస్తున్న ప్లాట్‌లోనే ఫ్యాన్‌కి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులే కారణమని పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడినట్టు సమాచారం. ప్రస్తుతం స్వప్న మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ఉస్మానియా హాస్పిటల్‌కి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## యూపీఐ నుంచి కరెంట్ బిల్లులుబంద్

**హైదరాబాద్, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
తెలంగాణ విద్యుత్ వినియోగ సంస్థలు TGSPDCL, TGNPDCL కీలక ప్రకటన చేశాయి. నెలవారీ విద్యుత్ బిల్లులను తమ అధికారిక వెబ్‌సైట్, యాప్‌లపై మాత్రమే చెల్లించాలని సూచించాయి. ఈ మేరకు అన్ని చెల్లింపు గేట్‌వేలు, బ్యాంకుల ద్వారా చెల్లింపులను నిలిపివేసినట్టు TGSPDCL ప్రకటించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వివరణ ఇచ్చారు. దేశవ్యాప్తంగా అన్ని విద్యుత్ సంస్థలకు ఆర్బీఐ కీలక ఆదేశాలు ఇచ్చినట్టు పేర్కొన్నారు. దీంతో ఇకపై తెలంగాణ విద్యుత్ వినియోగదారులు ఫోన్‌పే, పేటీఎం, అమెజాన్‌పే, గూగుల్ వంటి చెల్లింపు గేట్‌వేల ద్వారా కరెంట్ బిల్లులు చెల్లించడం సాధ్యపడదు.కాగా యూపీఐ యాప్‌ల ద్వారా కరెంట్ బిల్లుల చెల్లింపు పట్టణ ప్రాంతాల్లో గణనీయంగా ఉందని, కొన్నేళ్లుగా తమ నెలవారీ కరెంట్ బిల్లులను చెల్లించేందుకు వినియోగదారులు చెల్లింపు గేట్‌వేలను ఉపయోగిస్తున్నట్లు అధికారులు చెప్పారు. కాగా సోషల్ మీడియా వేదికగా చేసిన ఈ ప్రకటనపై పలువురు వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కఠినమైన నిర్ణయం తీసుకున్నారని వ్యాఖ్యానించారు. 'డిజిటల్ ఇండియా' లక్ష్యంలో ఒక అడుగు వెనక్కి వేశారంటూ పలువురు వినియోగదారులు వ్యాఖ్యానించారు. ఐఫోన్ వినియోగదారులకు కరెంట్ బిల్లుల చెల్లింపునకు ఒక్క యాప్ కూడా అందుబాటులో లేదని పలువురు యూజర్లు పేర్కొన్నారు. భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్ BBPS ద్వారా కరెంట్ బిల్లు చెల్లింపులకు అవకాశం ఇవ్వాలని పలువురు సూచించారు.

## బ్రిడ్జీల కూల్చివేతకు కారణమిదేనా

**పాట్నా, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
బిహార్ రాష్ట్రంలో ఇటీవల కాలంలో బ్రిడ్జిలు వరుసగా కూలిపోతున్నాయి. గడిచిన 17రోజుల వ్యవధిలో 12 బ్రిడ్జిలు కూలిపోయాయి. దీంతో అసలు బీహార్ లో ఏం జరుగుతుంది.. బ్రిడ్జిలు ఉన్నట్లుండి ఎందుకు కూలిపోతున్నాయనే అంశంపై బీహార్ లోనే కాదు.. దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుంది. భారీ వ్యయంతో నిర్మించిన బ్రిడ్జిలు స్వల్ప వ్యవధిలోనే కుప్పకూలుతుండటం పలు అనుమానాలకు తావునిస్తోంది. అయితే, వరుసగా బ్రిడ్జిలు కూలుతుండటంపై కాంట్రాక్టర్లు, అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిర్మాణ సమయంలో అధికారుల సరియైన పర్యవేక్షణ లేకపోవడం వల్లనే కాంట్రాక్టర్ల అరకొర పనులతో ఈ బ్రిడ్జి నిర్మాణాలు కూలిపోతున్నాయని కొందరు విమర్శలు గుప్పిస్తున్నారు.గడిచిన పదిహేడు రోజుల్లో అనేక ప్రాంతాల్లో బ్రిడ్జిలు కూలాయి. శివన్, సరన్, మధుబాణి, ఆరారియా, ఈస్ట్ చంపారన్, కృష్ణగంజ్ జిల్లాల్లో బ్రిడ్జిలు కూలిపోయాయి. మరోవైపు వరుసగా బ్రిడ్జిలు కూలిపోతుండటంపై ప్రతిపక్ష ఆర్జేడీ నేతలు నితీశ్ కుమార్ నేతృత్వంలోని ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. రాష్ట్రంలోనేకాక, దేశవ్యాప్తంగా ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతుండటంతో సీఎం నితీశ్ కుమార్ అప్రమత్తయ్యారు. బ్రిడ్జిలు కూలడానికి కారణాలపై దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీఎం నితీశ్ కుమార్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.భారీ వ్యయంతో నిర్మించిన వంతెనలుసైతం స్వల్ప కాలంలోనే కూలిపోవడంతో కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తుండగా.. మరోవైపు రాజకీయ దుమారానికి దారితీసింది. ఈ సమయంలో తాజా ఘటనలపై.. బీహార్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ స్పందించారు. బ్రిడ్జిలు ఎందుకు కూలిపోతున్నాయో చెప్పారు. ప్రస్తుతం రుతుపవనాల సమయం. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయి. ఈ కారణం చేతనే బ్రిడ్జిలు కూలిపోతున్నాయని అన్నారు. ఈ ఘటనపై సీఎం నితీశ్ కుమార్ సీరియస్ గా ఉన్నారు.. వెంటనే దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారంటూ కేంద్ర మంత్రి వెల్లడించారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలపై ప్రతిపక్ష నేతలు విమర్శలు చేస్తున్నారు. వర్షాలకే బ్రిడ్జిలు కూలిపోతాయా అంటూ ప్రశ్నిస్తున్నారు.

తెలుగు దినపత్రిక
# పీపుల్స్ మోటివేషన్
People's Motivation

ఆదివారం | జులై | 07 | 2024




# పవన్ మార్క్... పాలనా...

- అధికారంలోకి రాక మునుపు, వచ్చాక మారిన పవన్
- దీక్షలో ఉన్నా.. అంతకుముందు కూడా సంయమనం పాటిస్తున్న పవన్
- ప్రభుత్వ అధికారులపై దుర్భాషలాడితే చట్టపరంగా చర్యలు
- పార్టీని బలోపేతం చేసేదిశగా చర్యలు
- వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్

జనసేన అధినేత పవన్ కల్యాణ్ అధికారంలోకి రాకముందు.. వచ్చిన తర్వాత చూస్తే పూర్తిగా మారిపోయినట్లే కనిపిస్తుంది. గత నెల 12వ తేదీన డిప్యూటీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత పవన్ కల్యాణ్ తీరును గమనించిన వాళ్లు ఎవరైనా ఒకింత ఆశ్చర్యానికి గురవుతున్నారు. వారాహి అమ్మవారి దీక్షలో ఉన్నప్పటికీ, అంతకు ముందు కూడా ఆయన పూర్తిగా సంయమనం పాటిస్తున్నారనే అనుకోవాలి. ఎందుకంటే ఎక్కడా పవన్ కల్యాణ్ ఎక్కువ మాట్లాడటం లేదు. పవన్ కల్యాణ్ ను దగ్గర నుంచి చూసిన వారికి ఎన్నికలకు ముందు, తర్వాత ఇంత మార్పేమిటి అంటూ ఆశ్చర్యపోతున్నారంటే అతిశయోక్తి కాదు.





**కాకినాడ, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
ఎన్నికల సమయంలో పవన్ కల్యాణ్ ఊగిపోయేవారు. ప్రత్యర్థి పార్టీలపై విరుచుకుపడే వారు. చెప్పులు చూపించారు. కొన్ని వాడకూడని పదాలను కూడా వాడారు. ఆయన జనంలో ఎక్కువగా ఇమడలేనట్లుగా కనిపించారు. ఆవేశంతో ఊగిపోతూ చేసిన ఆయన ప్రసంగాలపై అప్పట్లో కొందరు రాజకీయ విశ్లేషకులు సయితం విమర్శలు చేశారు. ఎందుకంటే రాజకీయ నేతలకు అంత ఆవేశం పనికి రాదని, సహనంతో పాటు కొంత కంట్రోల్ లో ఉండాలని అనేక మంది అభిప్రాయపడ్డారు కూడా. ఒక దశలో అధికారంలోకి రాకముందే ఇలా ఉంటే, ఇక పవర్ లోకి వస్తే ఏం చేస్తారోనన్న కామెంట్స్ కూడా అనేక మంది నుంచి వినిపించాయి. తాను డిప్యూటీ ముఖ్యమంత్రి అయినప్పటికీ ఎక్కడా ఆయన దర్పం ప్రదర్శించడం లేదు. అనవసర ఖర్చులు చేయడం లేదు. ప్రజలతో మమేకం అవుతున్నారు. తన వద్దకు వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించడానికి ఆయన తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. మిస్సింగ్ అయిన ఒక యువతిని తొమ్మిది రోజుల్లో తెప్పించారంటే పవన్ కల్యాణ్ ఏ మేరకు తాను పనిలోకి దిగారో అర్థం చేసుకోవచ్చు. అంతే కాదు. అధికారులపై ఎవరూ దుర్భాషలాడవద్దని చెప్పడం కూడా ఆయన పరిణితికి అద్దంపడుతుంది. అధికారులంటే మనం చెప్పింది చేసినట్లు చేసేవాళ్లని, అధికారులను దూషిస్తే పార్టీ పరంగా చర్యలను కూడా తీసుకుంటానని జనసేన ఎమ్మెల్యేలను, పార్టీ నేతలకు కూడా పిఠాపురం వేదికగా వార్నింగ్ ఇచ్చారంటే ఆయనలో వచ్చిన మార్పునకు ఇంతకంటే మరే ఉదాహరణ అవసరం లేదు. గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నప్పటికీ వాటిని ఒక స్థాయి వరకే పరిమితం చేసుకున్నారు. అంతే తప్ప గతంలోలా ఆవేశపడి పోవడం లేదు. తాను చేయదలచుకున్నది, చేసేది మాత్రమే ప్రజలకు చెబుతున్నారు. ఆర్థిక పరిస్థితి సహకరిస్తే తాను మంత్రిగా మరింత బాగా పనిచేస్తానని ప్రజలకు నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్నారు. తనకు కేటాయించిన శాఖలపై క్రమంగా అవగాహన పెంచుకుంటున్న పవన్ కల్యాణ్ పూర్తిగా గ్రామాభివృద్ధిపై దృష్టి పెట్టాలని భావిస్తున్నారు. సినిమాలకు కూడా మూడు నెలల పాటు దూరంగా ఉంటానని, ఇప్పటి వరకూ అంగీకరించిన సినిమాలకు మూడు నెలల తర్వాత మాత్రమే డేట్స్ కొన్ని రోజులు కేటాయిస్తానని చెప్పుకొచ్చారంటే ఆయన పూర్తిగా బలపడే ప్రయత్నంలో ఉన్నారు. పార్టీకి సుదీర్ఘ భవిష్యత్ ను అందించడానికి ఆయన వ్యూహాత్మకంగానే అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తుంది. మొన్నటి ఎన్నికల్లో సక్సెస్ అయిన పవన్ స్ట్రాటజీ ఈ వ్యూహం కూడా వర్క్ అవుట్ అవుతుందని జనసేన నేతలు ఆశిస్తున్నారు.

## ఇసుక ఫ్రీ అయితే... కానీ కండిషన్స్ పై క్లారిటీ

**విజయవాడ, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
ఏపీలో ప్రజలకు ఉచితంగా ఇసుకను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జూలై 8నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ఇసుక అందుబాటులోకి రానుంది. అయితే ఇసుకను ప్రజలు ఎలా పొందాలనే దానిపై మాత్రం ఇంకా స్పష్టత రాలేదు.ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక ధరలు చుక్కలనంటుతున్నాయి. యూనిట్ లేదా టన్ను ధర గరిష్టంగా రూ.10వేలు పలుకుతోంది. ధర చెల్లించడానికి సిద్ధమైనా గత నెల రోజులుగా మార్కెట్లో ఇసుక దొరకడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందించాలనే నిర్ణయం తీపికబురే అయినా దాని ఫలితాలు ప్రజలకు ఏ మేరకు అందుతాయనేదే ప్రశ్నార్థకం. రాష్ట్ర వ్యాప్తంగా 40లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక వివిధ జిల్లాల్లో అందుబాటులో ఉంది. ప్రధానంగా కృష్ణా, గోదావరి, పెన్నా నది పరివాహక ప్రాంతాల్లోని ఇసుకే రాష్ట్రంలో నిర్మాణ రంగానికి ఆధారంగా ఉంటోంది. గత ఐదేళ్లలో ఇసుక ధరలు అమాంతం పెరిగిపోయాయి. రిటైల్ మార్కెట్లో లెక్కిస్తే ఇదంతా వేల కోట్ల కుంభకోణంగా మారింది. దశల వారీగా చేతులు మారుతూ వినియోగదారుడికి వచ్చేసరికి భారీగా చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.ప్రస్తుతం ఇసుక రెండు రకాలుగా ప్రజలకు చేరుతోంది. నదీ తీరాలు, డ్రెడ్జింగ్ ద్వారా ఇసుకను తవ్వి రీచ్‌ల నుంచి నేరుగా స్టాక్ పాయింట్లకు తరలిస్తున్నారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీటి ప్రవాహం లేనపుడు నేరుగా తవ్వుకుని అమ్మేస్తున్నారు. గత ఐదేళ్లలో టన్నుకు రూ.475 చొప్పున ఇసుకను విక్రయించారు. ఇప్పుడు ఇసుక ఉచితం అంటున్నా దాని ప్రయోజనాలు ప్రజలకు ఏ మేరకు అందుతాయనే సందేహాలు ఉన్నాయి. ఇసుక రీచ్‌లు, స్టాక్ పాయింట్ల నుంచి కస్టమర్‌కు చేరేలోపు దాని ధర విపరీతంగా పెంచేస్తున్నారు. పట్టణాలు, కార్పొరేషన్లకు దూరంగా ఇసుక రీచ్‌లు ఉండటంతో ఇసుక విక్రేతలు చెప్పిన ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం విజయవాడలో టన్ను ధర రిటైల్ మార్కెట్‌లో రూ.9-10వేలు పలుకుతోంది. ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందించినా దాని ధర రూ.3-4వేలకు తగ్గించకూడదని సిండికేట్లు భావిస్తున్నాయి. రవాణా, డీజిల్, డ్రైవర్ జీతాలు, వాహనం తరుగుదల ఇలా రకరకాల లెక్కలు వేసి ఇసుక అమ్మకాల్లో కనీస లాభం ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.సామాన్య ప్రజలు, భవన నిర్మాణదారులు నేరుగా ఇసుకను తవ్వుకుని, నిర్మాణాలు జరిగే ప్రాంతానికి తరలించుకునే అవకాశం ఉండదు. దానికి మరొకరి మీద ఆధారపడాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఆన్‌లైన్‌లో ఇసుకను కొనుగోలు చేసే అవకాశం కల్పిస్తామని చెబుతున్నాఅది ఏ మేరకు ఫలితాలను ఇస్తుందనేది ప్రశ్నార్థకమే. ఇసుకను ప్రభుత్వం ఉచితంగా ఇచ్చినా ఏదో రూపంలో దాని మీద సంపాదించేందుకు ఇప్పటికే దళారుల ప్రయత్నాలు మొదలయ్యాయి.

**ఇలా చేస్తే మేలు...**
ప్రస్తుతం ఇసుక విక్రయాల్లో ఉన్న లోపాలను సవరించాలి. ఉచిత ఇసుక ఇవ్వడం ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలు నేరుగా ప్రజలకే అందేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆన్‌లైన్‌లో విక్రయించే ఇసుకను నేరుగా ఎవరైనా ఆంక్షలు లేకుండా బుక్ చేసుకునే సదుపాయం కల్పించాలి. రవాణా ఛార్జీలను ప్రభుత్వమే నిర్ణయించాలి. స్టాక్ పాయింట్ లేదా రీచ్ నుంచి ఎంత దూరానికి ఎంత చెల్లించాలనే ధరను పట్టణాలు, మునిసిపాలిటీలు, సెమీ అర్బన్, రూరల్ ప్రాంతాల వారీగా ధరలను నిర్ణయించాలి. ఇసుక బుక్ చేసుకున్న తర్వాత గరిష్టంగా 24 గంటల్లోగా డెలివరీ జరిగేలా వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఇసుక తరలింపులో దళారుల ప్రమేయాన్ని పూర్తిగా నియంత్రించాలి. ఇసుకను అధిక ధరలకు విక్రయించినా, అక్రమంగా నిల్వ చేసిన వారిపై కఠిన చర్యలు, జరిమానాలు విధించడంతో పాటు వాటిని సక్రమంగా పాటించాలి. పట్టణాలు, కార్పొరేషన్లకు సమీపంలో ఉండే ప్రభుత్వ స్థలాల్లో స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేయడం ద్వారా రవాణా భారాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ఆన్‌లైన్‌లో ఇసుకను పొందే వ్యవస్థ మీద పక్కాగా నిఘా ఉంచాలి. ఎవరైనా స్వేచ్ఛగా ఇసుకను పొందే అవకాశం కల్పిస్తూనే దానిని దుర్వినియోగం చేస్తే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారనే నిబంధనను బుకింగ్ సమయంలోనే స్పష్టం చేయాలి. స్టాక్ పాయింట్లలో గుత్తాధిపత్యం లేకుండా బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల వద్ద పోలీసుల ఆధ్వర్యంలో నడిపే ప్రీపెయిడ్ ఆటో వ్యవస్థల తరహాలో టోకెన్ డెలివరీ మెకానిజం ఏర్పాటు చేయాలి. దూరాన్ని బట్టి రవాణా ఛార్జీలను నిర్ణయించే అధికారం ప్రభుత్వమే తీసుకోవాలి. ఇసుక రవాణా ద్వారా దళారులు లబ్ది పొందకుండా నిరుద్యోగులకు ఉపాధి కల్పించే మార్గంగా ఉపయోగిస్తే ఎక్కువ మందికి లబ్ది కలుగుతుంది. ఇసుక తవ్వకాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. తక్షణమే ఇసుక ధరలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా రీచ్‌లు, స్టాక్‌పాయింట్లు, డంప్‌ల పరిధిలో ఎంత ఇసుక అందుబాటులో ఉందని అధికారులను సిఎం ప్రశ్నించారు. ప్రస్తుతం 40 లక్షల టన్నులు అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. ఎనిమిది ఉమ్మడి జిల్లాల్లో ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా ఎనిమిది ఉమ్మడి జిల్లాల్లో ఇసుక అందుబాటులో ఉంది. దీనిని పక్కదారి పట్టకుండా ప్రజలకు అందిస్తే ఏపీలో ఐదేళ్లుగా కుదేలైన నిర్మాణ రంగం గాడిన పడుతుంది.

## బీటీ బ్యాచ్ ఎంత పని చేసిందో.....

**హైదరాబాద్, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
చేర్చుకుంటున్నప్పుడు బాగానే ఉంటుంది.. కానీ అధికారం పోయిన తర్వాత ఎవరూ ఉండరు. ఇది అన్ని పార్టీలకూ అప్లయ్ అవుతుంది. నాడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన తప్పులే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంది. నాడు తమ పార్టీ నుంచి వెళ్లి బీఆర్ఎస్ లో పదవులు పొంది, పదేళ్ల పాటు కాంగ్రెస్ పార్టీని విమర్శించిన వారిని కూడా వదలడం లేదు. ఎవరిని బడితే వారిని.. వస్తామంటే కండువా కప్పేశామా? లేదా? వాళ్లకు అస్సలు ప్రజల్లో ఇమేజ్ ఉందా? వారివల్ల భవిష్యత్ లో పార్టీకి ఉపయోగం ఉందా? అన్నది ఆలోచించడం లేదు. తాజాగా ఆరుగురు ఎమ్మెల్సీలు బీఆర్ఎస్ లో చేరారంటే నిజంగా కేసీఆర్ గతంలో చేసిన తప్పులేనని చెప్పక తప్పదు.నాడు కూడా కేసీఆర్ అన్ని రకాలుగా ఊసిపోయిన వాళ్లను తీసుకొచ్చి ఎమ్మెల్సీ పదవులు ఇచ్చారు. అంతే తప్ప తెలంగాణ ఉద్యమంలో తనతో పాటు తిరిగి, కేసుల్లో ఇరుక్కున్న వారిని మాత్రం పక్కన పెట్టారు. నాడు కేసీఆర్ ఎడా పెడా కాంగ్రెస్, టీడీపీ, కమ్యునిస్టులు ఇలా ఏ పార్టీని వదలకుండా నేతలను తమలో కలిపేసుకునే ప్రయత్నంలో భాగంగా కండువాలు కప్పారు. పదేళ్లు బాగానే ఉంది. కేసీఆర్ కు ఇదే నేతలు జై కొట్టారు. ఆయనంతటి లీడర్ లేడంటూ పొగిడేశారు. కానీ ఎప్పుడైతే అధికారం కోల్పోయిన వెంటనే తాను పిలిచి పదవులు ఇచ్చిన వాళ్లే నేడు తూచ్ అంటూ జారుకుంటున్నారు. నిజంగా కేసీఆర్ కు తెలిసిరావాల్సిందే. ఆయనకు జరగాల్సిందేనన్నది గులాబీ పార్టీ నుంచి వినిపిస్తున్నాయి.పార్టీ కోసం కష్టపడిన నేతలను పక్కన పెట్టారు. ఉద్యమంలో అన్నీ వదిలి జెండాను పట్టుకున్న నాయకులను వదిలేశారు. గొంతెత్తి అరిచిన లీడర్లను కూడా తోసి పారేశారు. కనీసం నామినేటెడ్ పదవులు ఇవ్వడానికి కూడా పదేళ్లు కేసీఆర్ కు మనసు రాలేదు. కానీ గతంలో ఎప్పుడో గెలిచిన వారిని, కాంగ్రెస్ లో పదవులు పొందిన వారిని తెచ్చుకుని నెత్తిన పెట్టుకున్నారు. ఏదో ఘన కార్యం సాధించినట్లు బిల్డప్ ఇచ్చారు. కాంగ్రెస్ ను ఖాళీ చేశానని జబ్బలు చరుచుకున్నారు. కానీ నేడు ఏమయింది రాత్రికి రాత్రే మకాం మార్చేశారు. వాళ్లకు కావాల్సింది అధికారం. అంతే తప్ప పార్టీ మీద ప్రేమ కాదన్నది ఇప్పటికైనా కేసీఆర్ కు అర్థమయి ఉండాలి. రెడీ అవుతున్న సర్కార్ కాంగ్రెస్ లో చేర్చుకోవడంపై... అయితే ఇదే నేతలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడంపై కూడా విమర్శలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే ఈ నిలకడలేని, నమ్మకం లేని నేతలను తెచ్చి పెట్టుకుని కేసీఆర్ చేసిన తప్పులనే కాంగ్రెస్ నేతలు చేస్తున్నారా? అని పార్టీ క్యాడర్ నుంచి వినిపిస్తున్న ప్రశ్నలు. వచ్చేవాళ్లంతా తమది కాంగ్రెస్ రక్తమేనని చెబుతున్నప్పటికీ ఈ ఐదేళ్లు ఆ బ్లడ్ వారిలో ఉంటుంది. అధికారం కోల్పోతే తర్వాత బ్లడ్ లేదు.. ఫ్లడ్ వచ్చినట్లు వెళ్లిపోతారన్నది గమనించుకోవాలని కార్యకర్తలు మండిపడుతున్నారు. అయితే శాసనమండలిలో బలం తక్కువగా ఉండటంతో ఏకంగా ఒకేసారి ఆరుగురిని చేర్చుకున్నామని అధికార కాంగ్రెస్ పార్టీ పైకి చెబుతున్నప్పటికీ వీరు ఎప్పటికీ పార్టీకి శాశ్వతం కాదు. అయితే ఆ నిజం తెలిసేలోగా ఐదేళ్లు ముగిసిపోతాయి.మళ్లీ ఇలాంటి నేతలను అధికారంలో బీఆర్ఎస్ వస్తే చేర్చుకోదన్న గ్యారంటీ కూడా ఏమీ లేదు. అదీ అసలు విషయం. మన నేతల బాగోతం.

## మూర్తా... మజాకా.. ?

**శ్రీకాళహస్తి, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
ఎక్కడైనా ...ఏ శాఖలోనైనా అధికారి కొత్తగా వస్తే కొంతమేరకైనా మార్పు కనిపించాలి. అప్పుడే ఆ అధికారికి గౌరవం.. మర్యాద.. మన్నన ఉంటుంది. అయితే మొన్నటి వరకు శ్రీకాళహస్తి దేవస్థానం ఇవోలుగా చెలామణి అయిన అధికారులు ఏమాత్రం చలనం లేకుండా... కేవలం కార్యాలయానికి... సంతకాలకు.. ఇతర కార్యక్రమాలకు పరిమితమై ఆలయానికి అప్రతిష్ట తీసుకు వచ్చారు. ఈనెల 1వ తేదీన ఈవోగా అదనపు బాధ్యతలు చేపట్టిన దేవదాయ శాఖ తిరుపతి ఆర్ జె సి మూర్తి రావడంతోనే ఆలయంలో మార్పులు ఒక్కొక్కటిగా జరుగుతున్నాయి. ప్రధానంగా 4 నంబరు గేటు నుంచి ఈవో కార్యాలయం వద్దకు వచ్చే వాహనాల సంఖ్యను భారీగా తగ్గించారు. ద్విచక్ర వాహనాలు రానివ్వకుండా కట్టడి చేశారు. అదేకాకుండా కార్లు కూడా పరిమిత సంఖ్యలో వచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. కొందరు అధికారులు గేటు వద్ద విధులు నిర్వహించే సిబ్బందిపై వాహనాలు పంపాలని ఒత్తిడి తెస్తున్నారు. అతిథుల వాహనాలను కూడా జ్ఞాన ప్రసూనాంబ అతిథి గృహం వద్దకు వచ్చి వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటే మరీ మంచిది. అంతర్గత బదిలీలు చేయాలని స్థానిక ఎమ్మెల్యే చెప్పినా ఈవో నాగేశ్వరరావుకు 25 రోజులు పాటు తీరికలేకుండా సంతకాలతో గడిపేసి ఉద్యోగ విరమణ చేసి వెళ్ళిపోయారు. బాధ్యతలు తీసుకున్న వెంటనే మూర్తి అంతర్గత బదిలీలపై దృష్టి పెట్టి శనివారం జాబితా విడుదల చేశారు. స్థానికంగా ఉన్నా లేకపోయినా పరిపాలనపై పట్టు సాధిస్తున్నారు. ఆలయంలో ఎక్కడ ఏం జరుగుతున్నదో... ఎవరు ఏ విధంగా వ్యవహరిస్తున్నారనే సమాచారం తెలుసుకొని ఆదేశాలిస్తున్నారు. సెల్ఫోన్ కౌంటర్లో కాంట్రాక్టర్, సిబ్బంది చేస్తున్న దోపిడీని స్వయంగా కనిపెట్టారు. వారి పని పట్టాల్సిన బాధ్యత కూడా ఉంది.అదనపు బాధ్యతలని ఊరుకోకుండా ఆలయంలో మార్పులు తీసుకొచ్చే విధంగా వ్యవహరిస్తున్న కొత్త ఇఓ ఇదే విధంగా వ్యవహరిస్తారని భక్తులు ఆశిస్తున్నారు.

## కాంగ్రెస్ వేదికపై విజయమ్మ...

**విజయవాడ, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**



ఏపీలో కీలక రాజకీయ పరిణామం. మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలపై ఉత్కంఠ కొనసాగుతోంది. తండ్రి పేరుతో జగన్ పార్టీ పెట్టారు. అధికారంలోకి రాగలిగారు. గత ఐదేళ్లలో వైయస్ జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అధికారిక కార్యక్రమం గా ప్రకటించి మరి వేడుకలు జరిపారు. కానీ ఈ ఏడాది అధికారానికి వైసీపీ దూరం కావడంతో... కేవలం ఇడుపులపాయలో నివాళులు అర్పించేందుకు మాత్రమే జగన్ ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ తరపున అట్టహాసంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు నిర్వహించేందుకు షర్మిల సిద్ధపడుతున్నారు. కాంగ్రెస్ అగ్ర నాయకులతో పాటు కీలక నేతలంతా హాజరయ్యే అవకాశం ఉంది. అయితే వారితో విజయమ్మ వేదిక పంచుకోనుండడం హాట్ టాపిక్ గా మారింది.కడప ఎంపీగా ఉంటూ కాంగ్రెస్ నాయకత్వాన్ని విభేదించారు జగన్. నాడు జగన్ కు అండగా నిలిచి కాంగ్రెస్ అధినాయకత్వంతో విభేదించారు విజయమ్మ. షర్మిల సైతం కాంగ్రెస్ అగ్రనాయకత్వంపై తీవ్ర విమర్శలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే 2019లో జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ మారింది. ఆ కుటుంబం స్వరంలో మార్పు వచ్చింది. భవిష్యత్తును వెతుక్కుంటూ షర్మిల కాంగ్రెస్ పంచన చేరారు. విజయమ్మ సైతం ఆమెను ఆశీర్వదించక తప్పలేదు.ఇప్పుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను షర్మిల కాంగ్రెస్ పార్టీ తరపున నిర్వహిస్తుండడంతో విజయమ్మ తప్పనిసరిగా హాజరు కావాలి. గతంలో కాంగ్రెస్ తన కుటుంబానికి తీవ్ర అన్యాయం చేసిందని పలుమార్లు విజయమ్మ విమర్శలు చేశారు. ఇప్పుడు అదే కాంగ్రెస్ నేతలతో వేదిక పంచుకునేందుకు సిద్ధమవుతున్నారు. కేవలం షర్మిల కాంగ్రెస్ పార్టీలో ఉండడంతో విజయమ్మకు ఈ అనివార్య పరిస్థితి ఏర్పడింది.ఈ ఎన్నికల్లో వైసిపి దారుణ పరాజయం పాలయ్యింది. అదే సమయంలో సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పుంజుకుంది. అటు కర్ణాటకతో పాటు తెలంగాణలో సైతం అధికారంలో ఉంది. సరిగ్గా ఈ సమయంలో ఏపీలో సైతం బలపడడానికి అవకాశం కలిగింది. అందుకే వైయస్ జయంతి వేడుకలను బలప్రదర్శనగా భావిస్తున్నారు షర్మిల. విజయవాడలో అట్టహాసంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్, సిద్ధరామయ్య, ఖర్గే సహా పెద్దలందరినీ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంతో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటడానికి చూస్తున్నారు. అయితే పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో అగ్రనేతలు హాజరవుతారా? లేదా? అన్నది చూడాలి.

## బ్రిటన్ పార్లమెంట్ లో 26 మంది బార్న్ ఇండియన్స్

**హైదరాబాద్, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**



బ్రిటన్ పార్లమెంటు ఎన్నికల్లో భారత సంతతి నేతలు సత్తా చాటారు. పార్లమెంటు దిగువ సభ అయిన హౌస్ ఆఫ్ కామన్‌లో భారత సంతతి హవా కొనసాగింది. భారత మూలాలు ఉన్న 26 మంది అక్కడి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. తెలుగు సంతతికి చెందిన ఉదయ్ నాగరాజు, చంద్ర కన్నెగంటి మాత్రం ఓడిపోయారు.ఈ ఎన్నికల్లో గెలుపొందిన భారత సంతతి నేతల్లో ప్రధాని రిషి సునాక్ ముందున్నారు. రిచ్మండ్ అండ్ నార్తర్న్ అలర్టన్ స్థానం నుంచి విజయం సాధించారు. మాజీ హోం మంత్రులు సుయెల్లా బ్రేవర్మన్, ప్రీతి పటేల్ తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. భారత సంతతికి చెందిన క్లెయిర్ కౌటిన్హో కూడా విజయం సాధించారు. సౌత్‌వెస్ట్ హెర్ట్‌ఫోర్డ్ షైర్ నుంచి కన్జర్వేటివ్ నేత గగన్ మొహీంద్ర, లైసెస్టర్ ఈస్ట్ నుంచి శివానిరాజా విజయం సాధించారు. లేబర్ పార్టీకి చెందిన రాజేశ్ అగర్వాల్‌పై శివాని విజయం సాధించారు. కన్జర్వేటివ్ పార్టీకి చెందిన శైలేష్ వారా, తొలిసారి పోటీలో దిగిన అమిత్ జోగియాలు స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు.భారత సంతతి విజేతల్లో ఎక్కువ మంది వామపక్ష లేబర్ పార్టీ నుంచే విజయం సాధించారు. బ్రిటన్ పార్లమెంటులో అడుగు పెట్టబోతున్నారు. వీరిలో సీమా మల్హోత్రా (వాల్సాల్ నియోజకవర్గం), వాలెరీ వాజ్ (బోక్స్ విచ్).. ఆమె సోదరి కీత్ వాజ్, లీసా నాండీ (విగాన్)లు భారీ మెజార్టీతో గెలుపొందారు. బ్రిటిష్ సిక్కు ఎంపీలు ప్రీత్ కౌర్ గిల్, తన్మంజిత్ సింగ్ దేహిలు మరోసారి విజయం సాధించారు. నావెందు మిశ్రా, రదిమా విటోమ్‌లు లేబర్ పార్టీ నుంచి భారీ మెజార్టీతో తమ స్థానాలను నిలబెట్టుకున్నారు.ఇదిలా ఉంటే.. 12 మంది బ్రిటన్ పార్లమెంటులో తొలిసారి అడుగు పెట్టబోతున్నారు. లేబర్ పార్టీకి చెందిన జాస్ అథ్వాల్, two శంకర్, సత్వీర్ కౌర్, హర్జోత్ ఉప్పల్, వారిందర్ జస్, గురిందర్ జోసన్, కనిష్క నారాయణ్, సోనియా కుమార్, సురీనా బ్రాకెన్‌బ్రిడ్జ్, కిరిత్ ఎంట్విజిల్, జీవన్ సంధేర్, సోజాన్ జోసెఫ్ తొలిసారిగా బ్రిటన్ పార్లమెంటులో అడుగుపెట్ట

## వైసీపీ ఎమ్మెల్యేలు...ఫిరాయింపులా

**నెల్లూరు, జూలై 6 (పీపుల్స్ మోటివేషన్) :**
పార్టీ నుంచి వెళ్లేవాళ్లు వెళ్తారు.. ఉండేవాళ్లు ఉంటారు. నైతికత ఉన్న వాళ్లు నాతోనే ఉంటారు " అని వైసీపీ అధినేత జగన్ తనతో సమావేశం అయిన నేతలతో వ్యాఖ్యానించినట్లుగా పార్టీ వర్గాలు ప్రకటించాయి. హఠాత్తుగా జగన్ ఇలా ఎందుకు చెప్పాల్సి వచ్చిందన్నది హాట్ టాపిక్ గా మారింది. పార్టీ నేతలు ఇప్పటి వరకూ పార్టీ మారుతారని ఎలాంటి సంకేతాలు రాలేదు. ఫలానా పార్టీతో చర్చలు జరుపుతున్నారని ఇంకా చెప్పుకోవడం లేదు. ఇలాంటి సమయంలో హఠాత్తుగా జగన్ పార్టీ నుంచి ఫిరాయింపుల గురించి చెప్పడం.. పోయేవాళ్లను బుజ్జగించడం.. ఆపే ప్రయత్నం చేయడం లాంటివి చేయనని చెప్పడం ఆశ్చర్యకరమే. అంతర్గతంగా ఏదో జరుగుతోందన్న అభిప్రాయం బయట ఉన్న వారికి కలుగుతోంది. ప్రభుత్వం మారినప్పుడల్లా అధికార పార్టీలోకి వలసలు సహజంగానే జరుగుతూ ఉంటాయి. నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ మారుతున్నామని వాదించే వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. తాజాగా తెలంగాణలో అదే జరిగింది. గతంలో వైసీపీ హయాంలో నలుగురు ఎమ్మెల్యేలు అదే సిద్ధాంతాన్ని చెప్పారు. అంతకు ముందు వైసీపీ నుంచి టీడీపీలోకి ఏకంగా 23 మంది ఎమ్మెల్యేలు చేరారు. వారు కూడా అదే చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం టీడీపీలో చేరామని చెప్పారు. ఎవరూ అధికార పక్షం నుంచి విపక్షంలో చేరరు. విపక్షం నుంచి అధికార పార్టీలో చేరుతారు. ఇప్పుడు టీడీపీ కూటమి ఏపీలో అధికారంలోకి వచ్చింది కాబట్టి ఆ కూటమి పార్టీల్లోకి సహజంగానే వలసలు ఉంటాయి. అయితే చేర్చుకునేంత భారీ సంఖ్యలో వైసీపీ ఎమ్మెల్యేలు గెలవలేదు. మారాలంటే ఎమ్మెల్సీలు.. ఓడిపోయిన ఇతర సీనియర్లే ఉంటారు. మరి వీరిలో ఎవరు పార్టీ మారబోతున్నారు.. ఏ పార్టీలో చేరబోతున్నారన్నది ఆసక్తికరం. తెలుగుదేశం పార్టీ ఇప్పుడు వైసీపీ నుంచి గెలిచిన పదకొండు మంది ఎమ్మెల్యేల్లో ఎవరైనా వచ్చి చేరుతామన్నా చేర్చుకునే పరిస్థితుల్లో లేదు. కానీ ఎమ్మెల్సీల విషయంలో మాత్రం ప్రత్యేక వ్యూహం అమలు చేయాల్సి ఉంది. శాసనమండలిలో ప్రస్తుతం వైసీపీకి మెజార్టీ ఉంది. ఏ బిల్లును అడ్డుకోగల శక్తి ఉంది. అయితే ఈ అడ్డుకోవడం అనేది పూర్తి స్థాయిలో సాధ్యం కాదు. ఒకటి, రెండు ప్రయత్నాల వరకే సాధ్యం. అయినా సరే టీడీపీకి ఇబ్బందులు వస్తాయి. మండలి చైర్మన్ కూడా వైసీపీకి చెందిన నేతే. ఇప్పటికే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు బిల్లు వస్తే అడ్డుకుంటామని వైసీపీ హైకమాండ్ సంకేతాలు ఇచ్చింది. అదే సమయంలో చాలా కీలకమైన బిల్లులు ఆమోదించేందుకు ఏపీ ప్రభుత్వం రెడీ అవుతోందని చెబుతున్నారు. అందుకే ఎమ్మెల్సీలను టీడీపీలో చేర్చుకోవాలన్న ఆలోచలో ఉన్నట్లుగా చెబుతున్నారు. ఒకరిద్దరికి కాకుండా మూడింట రెండు వంతుల మందిని విలీనం చేసుకునే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లుగా చెబుతున్నారు. ఇప్పిటకే ఈ అంశంపై సంప్రదింపులు జరుగుతున్నాయని ఈ విషయం తెలిసే జగన్మోహన్ రెడ్డి ఉంటే ఉంటారు పోతే పోతారని వ్యాఖ్యానించినట్లుగా చెబుతున్నారు. ఎమ్మెల్సీలు నేరుగా ఎన్నికైన వారు కాదు. వివిధ కోటాల్లో ఎన్నికయిన వాళ్లు. వచ్చే ఐదేళ్ల కాలంలో వైసీపీ తరపున ఒక్కరంటే ఒక్కరికీ కూడా ఎమ్మెల్సీ పదవులు దక్కే అవకాశం లేదు. నేరుగా ఎన్నికలు జరిగేది గ్రాడ్యుయేట్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీలకే. ఎమ్మెల్యే, గవర్నర్ కోటాల్లో వచ్చేవన్నీ టీడీపీకే వస్తాయి. స్థానిక సంస్థల ఎమ్మెల్సీలు కూడా విపక్షంలో ఉన్న పార్టీ గెలుచుకోవడం అంత తేలిక కాదు. ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉంటేనే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు గెలుచుకోగలుగుతారు. ఈ లెక్కన.. వచ్చే ఐదేళ్లలో ఒక్క ఎమ్మెల్సీ కూడా వైసీపీకి రావడం కష్టం. ఈ లోపు అందరి పదవి కాలం పూర్తవుతుంది. ఎమ్మెల్సీలు అందరూ తమకు మరో అవకాశం రావాలన్నా..రాజకీయంగా కాస్త పలుకుబడి ఉండాలన్నా అధికార పార్టీలో ఉండాలనుకుంటారు. అందుకే టీడీపీ ఆహ్వానాలపై పలువురు సానుకూలంగా స్పందించారనిచెబుతున్నారు. ఉత్తరాంధ్ర, కోస్తాల్లో కూటమికి వచ్చిన మెజారిటీలు చూస్తే ఎవరికైనా వైసీపీకి భవిష్యత్ ఉందని అనుకోరు. ప్రతి నియోజకవర్గంలోనూ యాభై వేల మెజార్టీ కనిపించింది. గత ఎన్నికల్లో పవన్ కల్యాణ్ ఓడిపోయిన గాజు వాక నియోజకవర్గంలో రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీ 95వేలు వచ్చింది. ఇక్కడ ఇండిపెండెంట్ గా పోటీ చేసిన ఓ అభ్యర్థికి గాజు గ్లాస్ గుర్తు కేటాయిస్తే ఐదు వేల ఓట్లు వచ్చాయి. అలాంటి వేవ్ కనిపించింది. వైసీపీ అసలు లెక్కలే లేదన్న అభిప్రాయం ఉంది. గుంటూరు వరకూ అదే పరిస్థితి ఉంది. అందుకే ఎక్కువ మంది వైసీపీ నేతలు.. ముఖ్యంగా కాపు నేతలంతా జనసేన పార్టీ వైపు చూస్తున్నారని చర్చ జరుగుతోంది. అందులో తాజా మాజీ మంత్రులు కూడా ఉన్నారని అంటున్నారు. కొంత మంది ఇటీవల కూటమి ప్రభుత్వంపై సానుకూల ప్రకటనలు చేస్తున్నారు. వారు తమకు ఇష్టమైన పార్టీలతో అంతర్గతంగా చర్చల్లో ఉన్నారని అంటున్నారు. మరో వైపు కాంగ్రెస్ పార్టీ కూడా ఆకర్ష్ కు ప్రయత్నాలు చేస్తోంది. వైసీపీకి భవిష్యత్ లేదని.. విజయమ్మ కూడా కాంగ్రెస్ వైపే ఉన్నారని వైఎస్ ఆత్మీయులందరూ కాంగ్రెస్ లోకి రావాలని పిలుపునిస్తున్నారు.అంతర్గతంగా ఈ విషయంపై కాంగ్రెస్ హైకమాండ్ తో కొంత మంది సంప్రదింపులు జరుపుతున్నారని కూడా అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ తరపును కడప ఎంపీ బరిలో ఉన్న వైఎస్ షర్మిలను ప్రజలు గెలిపించాలని విజయమ్మ కోరారు. మళ్లీ ఆమె జగన్ వైపు వెళ్తారని అనుకోవడం లేదు. ఈ పరిణామాలన్నింటితో పార్టీ నేతల్ని కాపాడుకోవడం అంత తేలిక కాదని జగన్ గట్టి గా నమ్ముతున్నారు. వారిని బుజ్జగించడం కన్నా..ఉంటే ఉన్నారు..పోతే పోయారు అన్నట్లుగా ఉండాలని డిసైడయ్యారని చెబుతున్నారు. అదే భావన ఆయన మాటల్లో వ్యక్తమవుతోందని అంటున్నారు.


తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# రాజ్ తరుణ్ కేసులో ట్విస్ట్



## లావణ్యకు నోటీసులు ఇచ్చిన పోలీసులు


టాలీవుడ్ నటుడు రాజ్ తరుణ్ తనని మోసం చేశాడంటూ అతని ప్రేయసి లావణ్య పోలీసులకు ఫిర్యాదు ఇచ్చిన విషయం తెలిసిందే. రాజ్ తరుణ్ తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి వదిలేసి వెళ్లిపోయాడని లావణ్య నార్సింగి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. తాము విడిపోవడానికి కారణం ఓ సినీ నటి అని, రాజ్ తరుణ్‌ను వదిలేయకపోతే చంపేసి బాడీ కూడా దొర క కుండా చినట్లు సినీ నటితోపాటు ఆమె సోదరుడిపై ఫిర్యాదు చేసింది లావణ్య. అయితే ఈ కేసులో పోలీసులు లావణ్యకే రివర్సులో నోటీసులిచ్చారు. ఈ నోటీసులో ఫిర్యాదుకు సంబంధించి తగిన ఆధారాలు సమర్పించాలని 91 సీఆర్‌పీసీ కింద నోటీసులు జారీ చేశారు. అయితే ఈ నోటీసులపై ఇంకా లావణ్య స్పందించలేదు. మరోవైపు లావణ్యను విచారణకు పిలిస్తే.. తన వైపు వాదనలను కూడా వినిపిస్తానని నటుడు రాజ్ తరుణ్ నార్సింగి పోలీసులతో చెప్పినట్లు సమాచారం. కాగా.. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. పదకొండేళ్లుగా రాజ్ తరుణ్‌తో రిలేషన్‌షిప్‌లో ఉన్నా. గుడిలో కూడా పెళ్లి చేసుకున్నాం. కానీ తన సినిమాలో నటిస్తోన్న హీరోయిన్‌తో అఫైర్ పెట్టుకొని నన్ను వదిలేశాడు. 3 నెలల క్రితం రాజ్ తరుణ్ ఇంటి నుంచి వెళ్లిపోయి దూరంగా ఉంటున్నాడు. రాజ్ తరుణ్‌ను వదిలేయకపోతే చంపేసి బాడీ కూడా మాయం చేస్తామని బెదిరిస్తున్నారు. రాజ్ తరుణ్ నా ప్రపంచం..రాజ్ తరుణ్ నాకు కావాలి. నాకు న్యాయం చేయాలి. గతంలో తనను డ్రగ్స్ కేసులో కావాలనే ఇరికించారని లావణ్య ఆవేదన వ్యక్తం చేసింది. ఈ కేసులో అరెస్టై 45 రోజులు జైల్లో ఉన్నానని.. ఆ సమయంలో రాజ్ తరుణ్ ...కెలాంటి సాయం చేయలేదని పేర్కొంది లావణ్య. ... ఈ వ్యాఖ్యలపై స్పందించిన రాజ్ తరుణ్.. ...ను మోసం చేసిన మాట అవాస్తవం. ...తకుముందు రిలేషన్‌లో ఉన్నాను. కానీ ... మొదలుపెట్టింది. అదే కాకుండా ...్య రిలేషన్‌షిప్‌లో ఉంది. కన్న తండ్రిని కూడా లావణ్య మోసం చేసింది. ఇంట్లో ఉంటునే నన్ను టార్చర్ పెట్టింది. అందుకే లావణ్య టార్చర్ భరించలేకపోయా.. లావణ్యను నేను మోసం చేయలేదు. తానే నన్ను మోసం చేసింది. అందువలనే నేను జీవితంలో పెళ్లి చేసుకోవద్దు



అనుకుంటున్నా అంటూ రాజ్ తరుణ్ వెల్లడిరచాడు.

## ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ స్వప్న వర్మ ఆత్మహత్య

టాలీవుడ్‌లో విషాదం చోటుచేసుకుంది. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ స్వప్న వర్మ (33) ఆత్మహత్య చేసుకుంది. హైదరాబాద్‌లోని మాదాపూర్ కావూరి హిల్స్‌లో తాను ఉంటున్న ప్లాట్ లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడిరది. ఆర్థిక ఇబ్బందులకు తోడు.. ఆరు నెలలుగా సినిమాలు లేకపోవడంతోనే ఆమె ఆత్మహత్య చేసుకుని ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. స్వప్న వర్మ స్వస్థలం రాజమండ్రి. మూడేళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చింది. మాదాపూర్ కావూరి హిల్స్‌లోని తీగల హౌస్ అపార్ట్‌మెంట్ 101 ప్లాట్ లో ఒంటరిగా ఉంటుంది. అయితే ఆరు నెలలుగా సినీ పరిశ్రమలో ఎలాంటి ప్రాజెక్టులు లేవు. దీంతో ఆర్థిక ఇబ్బందులు కూడా పెరిగిపోయాయి. ఈ క్రమంలోనే మానసికంగా ఒత్తిడికి గురైన ఆమె.. తన ప్లాట్ ట్‌లో రెండు రోజుల క్రితం ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడిరకుంది. ప్లాట్ డోర్ వేసి ఉండటంతో ఈ విషయాన్ని ఎవరూ ఇది గమనించలేదు. ఇవాళ ఉదయం ప్లాట్ నుంచి దుర్వాసన రావడంతో చుట్టు పక్కల వాళ్లు పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సమాచారంతో అక్కడకు వచ్చిన పోలీసులు.. ప్లాట్  తలుపులు పగులగొట్టి చూడగా ఉరివేసుకుని స్వప్న వర్మ కనిపించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు స్వర్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.



## అసలు కథంతా ముందున్నది


### కల్కి సీక్వెల్‌పై నాగ్ అశ్విన్ వ్యాఖ్య

ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి 2898 ఏడీ' ప్రభంజనం సృష్టిస్తోంది. ఈ చిత్రానికి సీక్వెల్ ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే నిర్మాత పలు సందర్భాల్లో దాని గురించి మాట్లాడారు. తాజాగా మొదటిసారి నాగ్ అశ్విన్ 'కల్కి' సీక్వెల్‌పై స్పందించారు. అసలు కథ మొదలయ్యేది పార్ట్2లోనే అంటూ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. సీక్వెల్‌కు సంబంధించి నెలరోజుల షూటింగ్ చేశాం. దానిలో 20శాతం బెస్ట్‌గా వచ్చింది. ఇంకా ముఖ్యమైన యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించాల్సి ఉంది. వాటిని కొత్తగా ప్రారంభించాలి. ఈ సీక్వెల్‌లో కమల్ హాసన్, ప్రభాస్ , అమితాబ్ మధ్య భారీ యాక్షన్ సన్నివేశాలుంటాయి. అశ్వత్థామ, కర్ణుడు, యాస్కిన్‌ల మధ్య శక్తిమంతమైన ధనుస్సు కీలకం కానుందని అన్నారు. యాస్కిన్ పాత్రకు సీక్వెల్‌లో నిడివి ఎక్కువ ఉంటుందని ఇటీవల కమల్ కూడా చెప్పారు. దీంతో 'కల్కి2'పై ఆసక్తి పెరిగింది. ఈ సినిమాకు వస్తోన్న ఆదరణపై నాగ్ అశ్విన్ సంతోషం వ్యక్తం చేశారు. 'ప్రేక్షకులు దీన్ని ఎంతగానో ఎంజాయ్ చేస్తున్నారు. ఎంతోమంది ఆడియన్స్ ఒకసారి కంటే ఎక్కువసార్లు దీన్ని వీక్షిస్తున్నారు. సినిమా విజయం సాధించిందని చెప్పడానికి అదే సంకేతం' అంటూ ప్రేక్షకులకు ధన్యవాదాలు చెప్పారు. జూన్ 27న ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కల్కి' కలెక్షన్లలో రికార్డులు




సృష్టిస్తోంది. ఇప్పటి వరకు రూ.700కోట్లకు పైగా వసూళ్లు చేసినట్లు చిత్రబృందం తెలిపింది. త్వరలోనే ఈ సైన్స్ ఫిక్షన్ రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయమని అభిమానులు అంటున్నారు. ఆడియన్స్‌ను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లిన ఈ చిత్రంలో అగ్ర నటులు అమితాబ్ బచ్చన్.. అశ్వత్థామగా, కమల్ హాసన్.. సుప్రీం యాస్కిన్‌గా ఆకట్టుకున్నారు. విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్ అతిథి పాత్రలతో అలరించారు. బౌంటీ టైర్ భైరవగా సందడి చేసిన ప్రభాస్.. చివరిలో కర్ణుడిగా కనిపించి పార్ట్ 2పై మరిన్ని అంచనాలు పెంచేశారు. ఇప్పుడు నాగ్ అశ్విన్ కామెంట్స్‌తో అవి రెట్టింపయ్యాయి.

## రాజమౌళిపై నెట్‌ఫ్లిక్స్ డాక్యుమెంటరీ



'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్'లతో ప్రపంచాన్ని ఆకర్షించిన రాజమౌళిపై నెట్‌ఫ్లిక్స్ డాక్యుమెంటరీ రూపొందించింది. దీని స్ట్రీమింగ్ తేదీని, ఇందులో ఏం చూపనున్నారో తెలుపుతూ తాజాగా ఆ సంస్థ పోస్ట్ పెట్టింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేసింది. 'మోడ్రన్ మాస్టర్స్' పేరుతో ఇది రానున్నట్లు తెలిపింది. 'ఒక మనిషి.. అనేక బ్లాక్‌బస్టర్‌లు.. అంతులేని ఆశయం. ఈ లెజెండరీ దర్శకుడు ఇంత గుర్తింపు తెచ్చుకోవడానికి ఎంత కష్టపడ్డారు? ఎన్ని సంవత్సరాలు పట్టింది? ఇలాంటి అంశాలతో 'మోడ్రన్ మాస్టర్స్' రూపొందింది. ఆగస్టు2 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానుంది' అని సంస్థ పేర్కొంది. దీన్ని అనుపమా చోప్రా సమర్పించనున్నారు. ఈ డాక్యుమెంటరీలో పలువురు హాలీవుడ్ దర్శకులు, సినీ ప్రముఖులు రాజమౌళిపై వారి అభిప్రాయాలను తెలియజేయనున్నారు. టాలీవుడ్ స్టార్ హీరోలు కూడా ఈ దర్శక ధీరుడితో వారి అనుబంధాన్ని పంచుకోనున్నట్లు తెలుస్తోంది. రాజమౌళి ప్రస్తుతం మహేశ్‌బాబుతో తీయనున్న ప్రాజెక్ట్‌తో బిజీగా ఉన్నారు. దీని ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ హీరోయిన్‌గా, హాలీవుడ్ ప్రముఖ నటుడు క్రిస్ హెమ్స్‌వర్త్ కీలక పాత్ర పోషించనున్నారని కూడా జోరుగా ప్రచారమవుతోంది. త్వరలోనే దీనికి సంబంధించి అధికారిక ప్రకటన రానుందని సమాచారం.

## ఉత్తరాది నుంచి వచ్చిన మాల్వి

### రాజ్‌తరుణ్‌తో సినిమాలో హీరోయిన్

తెలుగు యువ నటుడు రాజ్ తరుణ్ ఇప్పుడు వార్తల్లో వున్నాడు. అతని ప్రియురాలు అని చెప్పుకుంటున్న లావణ్య అనే అమ్మాయి నార్సింగి పోలీసు స్టేషన్ లో రాజ్ తరుణ్ పై ఫిర్యాదు చేసింది. తనని ప్రేమించి, పెళ్లి చేసుకుంటాను అని మోసం చేశాడని ఆ ఫిర్యాదులో పేర్కొంది. అలాగే రాజ్ తరుణ్ ఇప్పుడు చేస్తున్న సినిమా 'తిరగబడరా స్వామి' లో కథానాయికగా చేస్తున్న మాల్వి మల్హోత్రాతో కలిసి ఉంటున్నాడని కూడా ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్టుగా తెలిసింది. అయితే లావణ్య తన ఫిర్యాదులో పేర్కొన్నట్టుగా రాజ్ తరుణ్ నిజంగానే మాల్వి తో వుంటున్నాడా? ఇంతకీ ఈ మాల్వి ఎవరు అన్న ఆసక్తి వస్తోంది. మాల్వి మల్హోత్రా హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో మండి అనే వూర్లో ఒక పంజాబీ కుటుంబంలో పుట్టింది. చదువంతా చండీగఢ్ లో సాగింది, తరువాత ఆమె ముంబాయి షిఫ్ట్ అయి, మాస్టర్స్ ఇన్ కంప్యూటర్స్ కోసం యూనివర్సిటీ అఫ్ ముంబైలో చదివింది. నటిగా ముందుగా కనిపించింది మాత్రం బుల్లితెరపైనే, 2017లో 'ఉడాన్' అనే సీరియల్ లో.. వెండి తెరపై ఆమె అరంగేట్రం చేసింది 'హోటల్ మిలన్' అనే సినిమాలో. ఇది 2018లో విడుదలైంది. సుమారు నాలుగేళ్ల తరువాత మాల్వి 'తమస్' అనే ఒక షార్ట్ ఫిలింలో నటించింది. ఇది 2022లో వచ్చింది. ఆ తరువాత సంవత్సరం మాల్వి ఒక ఓటిటి సినిమాలో నటించింది, కానీ ఆమెకి తగినంత గుర్తింపు రాలేదనే చెప్పాలి. 2023లో 'అభ్యుహం' అనే సినిమాతో మలయాళంలో అరంగేట్రం చేసింది. అదే సంవత్సరం రాజ్ తరుణ్ కథానాయకుడిగా నటించిన 'తిరగబడరా స్వామి' సినిమాతో తెలుగులో కూడా అరంగేట్రం చేస్తోంది. ఈ సినిమా ఇప్పుడు ప్రచారాలు చేస్తున్నారు, త్వరలోనే విడుదలవుతుంది. ఈ సినిమా చాలా కాలం నుండి చిత్రీకరణ, తరువాత పోస్ట్ ప్రొడక్షన్ ఇలా చేసుకుంటూ ఈమధ్యనే పూర్తి చేసుకుంది. రాజ్ తరుణ్ ప్రియురాలు లావణ్య ఆరోపిస్తున్నట్టుగా రాజ్ తరుణ్ ఈ సినిమాలో చేస్తున్న మాల్వి మల్హోత్రాతో వుంటున్నట్టుగా ఆరోపిస్తుంది. మరి అందులో నిజమెంతవుందో మాత్రం వీళ్ళకే తెలియాలి.

Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com